

ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:96 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 27-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

పంట వేయొద్దంటున్నారు సారూ..
మరి రైతు, రైతు కూలీలు,
కౌలు రైతులు ఎట్లా బతకాలి..
ఎల్‌నినో సాకుతో పంటలు
వేయొద్దంటున్నారు..
సాగుకు సరిపడా కరెంటు కూడా
ఇవ్వడం లేదు సారూ..
గత ప్రభుత్వం కరెంటు కోతలు
లేకుండా ఇచ్చింది.. మరి మీరు ఎందుకు
ఇవ్వడం లేదు సారూ..
కరెంటు కోతలతో రైతన్నలు
గోసపడుతుంటే పట్టించుకునేది ఎవరు..
అప్పులు తెచ్చి సాగు చేసే
రైతుల పరిస్థితి ఏంటి..
వ్యవసాయంపైనే ఆధారపడిన
రైతు కూలీలకు
పని ఎలా దొరుకుతుంది..
కౌలు రైతుల కుటుంబాలు బతికేదెలా..
పంటలు పండకపోతే రైతుల ఇళ్లలో
పొయ్యి ఎలా వెలుగుతుంది..
రైతుల కష్టాలు పాలకులకు ఎందుకు
కనిపించడం లేదు..
సాగుకు అడ్డంకులు సృష్టిస్తే
గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తుంది..
పంటలు వద్దంటే సరిపోదు సారూ..
రైతన్నకు కరెంటు, సాగుకు భరోసా,
బతుకుకు భద్రత కల్పించాల్సిన
బాధ్యత ప్రభుత్వానిదే కాదా..

నడ్డి శివకృష్ణ యాదవ్
ప్రజా వాయిస్
ఉమ్మడి నల్గొండ బ్యూరో చీఫ్

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర సానుకూలం

- 152 మీటర్ల ప్రతిపాదనపై అధ్యయనం!
- సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ మధ్య కీలక భేటీ
- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 148 నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాజెక్టు అవసరాన్ని వివరించిన మంత్రి ఉత్తమ్
- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం
- రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ
- నీటి లభ్యత, ముంపు, సాంకేతిక అంశాలపై అధ్యయనం

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రాణహిత నదిపై తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మించతలపెట్టిన ఈ బ్యారేజీ ఎత్తును పెంచే ప్రతిపాదనపై మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమైంది. సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు.

152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలని ప్రతిపాదన

తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సిన అవసరాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2016లో బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే ఆ ఎత్తుతో తెలంగాణకు అవసరమైన తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే సరైన ప్రత్యామ్నాయమని వివరించారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఆదిలాబాద్ వెనుకబాటుతనాన్ని వివరించిన ఉత్తమ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎంత కీలకమో మంత్రి ఉత్తమ్ మహారాష్ట్ర ప్రతినిధి బృందానికి వివరించారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఆ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. సాగునీరు, ఆర్థిక అవకాశాలు లేకపోవడం వల్ల గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఈ

మిగతా 2లో

మాదాపూర్‌లో వ్యభిచార ముఠాపై పోలీసుల దాడి

- ముగ్గురు ఉజ్బెకిస్థాన్ మహిళలు అదుపులోకి
- చంద్రనాయక్ తండాలోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై ఎస్‌వోటీ పోలీసుల దాడి
- 204వ నంబరు గదిలో ముగ్గురు విదేశీ మహిళల గుర్తింపు
- పాస్‌పోర్టు, వీసా పత్రాలు లేవని పోలీసుల వెల్లడి
- ఢిల్లీకి చెందిన నాయక్ ప్రధాన నిందితుడిగా గుర్తింపు
- పరారీలో ఉన్నట్లు సమాచారం
- సర్వీస్ అపార్ట్‌మెంట్ల నిర్వాహకులకు గుర్తింపు పత్రాల తనిఖీపై హెచ్చరిక

2 లో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

- రూ.24,269 కోట్లతో 76 కి.మీ. మేర విస్తరణ
- ఐదు కొత్త కారిడార్ల నిర్మాణానికి ఆమోదం
- నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో
- పాతబస్తీ, పటాన్‌చెరు, హయత్‌నగర్‌కు మెరుగైన కనెక్టివిటీ
- 2029 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యం

2లో

నీటి వృథాపై ఉక్కుపాదం

- ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా!
- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- పడిపోతున్న జలాశయాల నీటి మట్టాలు
- నగరంలో తాగునీటి కొరత
- నీటి వృథాపై ప్యారడైజ్ హోటల్‌కు జలమండలి జరిమానా
- ఇటీవల ఫోర్ ఫాదర్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా.. నీటి కనెక్షన్ తొలగింపు
- 333 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలని నిపుణుల సూచన

ప్రజా వాయిస్, హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతుండటంతో తాగునీటి సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే సింగూరు ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పడిపోతోంది. ఈ నేపథ్యంలో సాగునీటి కంటే తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తోంది. నీటి వృథాను అరికట్టేందుకు జలమండలి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌కు తాజాగా రూ.20 వేల జరిమానా విధించారు.

హోటల్‌లో నీటి వృథా గుర్తింపు

హైదరాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో

మిగతా 2లో

నవంబర్ 2న అమిత్ షా తెలంగాణ పర్యటన

- ఎస్ఐఆర్‌కు మద్దతుగా బీజేపీ మహాపాదయాత్ర
- నవంబర్ 1న హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభం
- రెండో రోజు పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి
- గతంలో పలుమార్లు వాయిదా పడిన పర్యటన
- తెలంగాణలో పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి

2 లో

హైదరాబాద్‌ను వెంటాడుతున్న మంచినీటి సంక్షోభం

- నాలుగు జలాశయాల్లో అడుగంటిన నీటి నిల్వలు!
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే నగరంలో తాగునీటి సరఫరా
- సింగూరులో 29.9 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 3.4 టీఎంసీలే నిల్వ
- రోజుకు 6,000 నుంచి 8,000 వాటర్ ట్యాంకర్ల బుకింగ్స్
- గోదావరి జలాలను మళ్లించి నగరంలో నీటి సరఫరాకు జలమండలి చర్యలు

ప్రజా వాయిస్, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో వర్షాలు కురిపించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాల వల్ల అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ.. అవి నీటి కొరతను తీర్చడానికి సరిపోవడం లేదు. ఈ ప్రభావం హైదరాబాద్ నగరంపైనా తీవ్రంగా పడుతోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో నగరంలో మంచినీటి సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇప్పటికే నీటి సరఫరా వేళలను కుదించిన జలమండలి.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా

మిగతా 2లో

రూ.40 కోట్ల కోసం ప్రాణాలైనా ఇస్తా

- ప్రభుత్వానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక!
- నియోజకవర్గానికి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే డిమాండ్
- రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం
- 30 వేల మందితో కలిసి చనిపోయే వరకు దీక్ష చేస్తానని ప్రకటన
- రూ.40 కోట్ల విలువనా.. నా ప్రాణం విలువనా అంటూ ప్రభుత్వానికి ప్రశ్న
- గురువు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి రోడ్లు పూర్తి చేయాలని విజ్ఞప్తి

2 లో

ప్రైవేటు స్కూళ్ల అనుమతుల్లో రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలు

- డీఎంకే మాజీ మంత్రి అన్బిల్ మహేశ్ అరెస్ట్!
- ప్రైవేటు పాఠశాలలకు అనుమతుల పేరుతో అక్రమ వసూళ్ల ఆరోపణలు
- 177 పాఠశాలలు ప్రభావిత మైనట్లు దర్యాప్తులో గుర్తింపు
- ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన మద్రాస్ హైకోర్టు
- మనీలాండరింగ్ కోణంలో ఈడీ కేసు నమోదు
- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారన్న - స్టాలిన్

ప్రజా వాయిస్, చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. డీఎంకే సీనియర్ నేత, మాజీ పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తామంటూ అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.100 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్రాస్ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన కొద్దిసేపటికే అరెస్టు జరగడం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

177 పాఠశాలలకు సంబంధించి విచారణ

ప్రైవేటు పాఠశాలలకు శాశ్వత గుర్తింపు, గుర్తింపు పునరుద్ధరణ, భవన నిర్మాణ

మిగతా 2లో

మాదాపూర్‌లో వ్యభిచార ముఠాపై పోలీసుల దాడి



ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్‌లో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెంచారు. మాదా పూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై మాదాపూర్, కూకట్‌పల్లి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌వోటీ) పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భం గా అపార్ట్‌మెంట్‌లోని 204వ నంబరు గదిలో ఉన్న ముగ్గురు ఉజ్బెకిస్థాన్ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. సరైన పాస్‌పోర్టు, వీసా పత్రాలు లేకుండా నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

అనుమానాస్పద కార్యకలాపాలపై దాడులు

చంద్రనాయక్ తండాలోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు విదేశీ మహిళలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారు అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారి భారత్ ప్రవేశం, వీసా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు.

ప్రధాన నిందితుడి కోసం గాలింపు

ఢిల్లీకి చెందిన నాయక్ అనే వ్యక్తి ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ప్రస్తుతం అతడు పరారీలో ఉండటంతో ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మరెవరైనా సహకరించారా? ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

సర్వీస్ అపార్ట్‌మెంట్ల నిర్వాహకులకు హెచ్చరిక

ఈ ఘటన నేపథ్యంలో సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హోటళ్ల నిర్వాహకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. గదులను అద్దెకు ఇచ్చే ముందు కస్టమర్ల గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, నిబంధనల ప్రకారం వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు.అదుపులోకి తీసుకున్న మహిళలకు సంబంధించి చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తామని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో వెల్లడయ్యే ఆధారాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర సానుకూలం

మొదటి పేజీ తరువాయి

ప్రాంతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తడానికి ఆర్థిక వెనుకబాటుతనం కూడా ఒక కారణమని వివరించారు.1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్.బీ. చవాన్ మధ్య సాగునీటి అవసరాల కోసం ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తుచేశారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామని తెలిపారు.

ముంపు భూములకు పరిహారం చెల్లిస్తాం

బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమలులో ఉన్న భూసేకరణ నిబంధనల ప్రకారం రైతులకు పరిహారం అందిస్తామని తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం, నీటి తరలింపు, పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

తెలంగాణ ప్రతిపాదనపై ఫడ్నవిస్ సానుకూలం

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆదిలాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని కూడా గుర్తుచేశారు. బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను పునఃపరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే తుది నిర్ణయం తీసుకునే ముందు సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన ఒప్పందాన్ని పునఃపరిశీలించడానికి అభ్యంతరం లేదని తెలిపారు. కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

అధికారుల కమిటీ ఏర్పాటు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవిస్ ప్రతిపాదించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కమిటీ పరిశీలించనుంది. రెండు రాష్ట్రాల అంచనాలను సమీక్షించి అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు.

అభివృద్ధికి కలిసి పనిచేయాలని నిర్ణయం

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు పరస్పరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రులు సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. తెలంగాణ సాగు, తాగు నీటి అవసరాలకు కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రతిపాదనపై తాజా చర్చలు ప్రాజెక్టు భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.

రూ.40 కోట్ల కోసం ప్రాణాలైనా ఇస్తా

ప్రజా వాయిస్, హైదరాబాద్: కాంగ్రెస్ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గానికి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి చనిపోయే వరకు దీక్ష చేస్తానంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

రూ.40 కోట్లు ఇవ్వాల్సిందే..

జడ్చర్ల నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. చాలా కాలంగా నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు కోరుతున్నట్లు తెలిపారు. రోడ్ల పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గానికి రావాల్సిన బిల్లులు చెల్లించాలని, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రూ.40 కోట్ల నిధుల కోసం తాను ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు.

గురువు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి

రోడ్ల నిర్మాణం విషయంలో తన గురువు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి అనిరుధ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ''మనకు రోడ్లు ఇచ్చింది ఎవరు..? నా గురువు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. ఆయననే అడుగుతున్నా.. అన్నా కొబ్బరికాయ కొట్టి పోయినవ్.. పూర్తి చేయాలి'' అంటూ వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో రోడ్ల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

30 వేల మందితో దీక్షకు సిద్ధం

డిప్యూటీ సీఎం తన నియోజకవర్గంలో పాదయాత్రకు వచ్చిన సమయంలో 30 వేల మందితో సభ ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇప్పుడు అదే స్థాయిలో ప్రజలను సమీకరించి నిధుల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. నియోజకవర్గానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. ''నేను చనిపోతున్నా నిధులు ఇవ్వరా?'' అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

నా ప్రాణం విలువనా.. రూ.40 కోట్ల విలువనా?

నిధుల విడుదలపై తీవ్ర భావోద్వేగంతో స్పందించిన అనిరుధ్ రెడ్డి.. ''అనిరుధ్ రెడ్డి చచ్చిపోతేనే జడ్చర్లకు నీళ్లు ఇస్తామంటే.. నేను ఆమరణ నిరాహార దీక్షలో చనిపోతా'' అంటూ వ్యాఖ్యానించారు. ''మరి రూ.40 కోట్లు విలువనా..? లేదా నా ప్రాణం విలువనా..? అనేది మా ప్రభుత్వం నిర్ణయించుకోవాలి'' అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

గతంలోనూ సంచలన వ్యాఖ్యలు

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గతంలోనూ పలు అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వార్తల్లో నిలిచారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా వివిధ రాజకీయ అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఇప్పుడు సొంత పార్టీ ప్రభుత్వాన్ని నిధుల విషయంలో హెచ్చరించడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. జడ్చర్ల అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలన్న ఆయన డిమాండ్, ఆమరణ నిరాహార దీక్ష ప్రకటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

నీటి వృథాపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి

జలమండలి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు వృథా అవుతున్నట్లు గుర్తించారు. దీంతో హోటల్‌కు రూ.20 వేల జరిమానా విధించారు. నీటి వృథాను వెంటనే అరికట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హోటల్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలో నీటి కొరత తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో వాణిజ్య సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పబ్‌కు నీటి కనెక్షన్ తొలగింపు

ఇటీవల జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌లోనూ జలమండలి అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ తాగునీరు వృథా అవుతున్నట్లు గుర్తించి రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు నీటి కనెక్షన్‌ను తొలగించారు. నీటి వృథాపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తుండటం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి పొదుపు చర్యలను మరింత విస్తృతం చేయాలని జలమండలి భావిస్తోంది.

రోజుకు లక్షల లీటర్ల నీరు వృథా

హైదరాబాద్‌కు కీలకమైన జంట జలాశయాల నుంచి సరఫరా అవుతున్న నీటిలో రోజుకు దాదాపు 10 లక్షల లీటర్లకు పైగా వృథా అవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పైపులైన్ల లీకేజీలు, ఇతర కారణాలతో రోజుకు నాలుగైదు వేల ఇళ్లకు సరిపడా నీరు వృథా అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించాలని, ఇంట్లోనూ, వాణిజ్య సంస్థల్లోనూ నీటి వృథాను అరికట్టాలని జలమండలి అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలి

రాష్ట్రంలో అక్టోబర్ 28 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇళ్లపై పడే వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. ఇంట్లో వినియోగించిన నీటిని కూడా సాధ్యమైనంత వరకు పునర్వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని పేర్కొంటున్నారు.

333 మండలాల్లో తీవ్ర వర్షాభావం

రాష్ట్రంలోని 18 జిల్లాల పరిధిలో 333 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో 13 జిల్లాల్లో అత్యంత దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రజలు, వాణిజ్య సంస్థలు నీటి పొదుపులో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు.

నవంబర్ 2న అమిత్ షా తెలంగాణ పర్యటన

ప్రజా వాయిస్, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మద్దతుగా బీజేపీ నిర్వహించనున్న మహాపాదయాత్రలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపాయి. గతంలో పలుమార్లు వాయిదా పడిన అమిత్ షా పర్యటన ఈసారైనా ఖరారవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఎస్ఐఆర్‌కు మద్దతుగా మహాపాదయాత్ర

ఎస్ఐఆర్ ప్రక్రియపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఇందులో భాగంగా నవంబర్ 1న హైదరాబాద్‌లో మహాపాదయాత్ర ప్రారంభం కానుంది. నవంబర్ 2న ఈ యాత్రలో అమిత్ షా పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విపక్షాలు రాజకీయ వివాదంగా మారుస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. మరోవైపు, ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ సహా విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్ఐఆర్‌పై రాజకీయ పోరు మరింత వేడెక్కే అవకాశముంది.

పలుమార్లు వాయిదా పడిన పర్యటన

అమిత్ షా తెలంగాణ పర్యటన గతంలో అనేకసార్లు వాయిదా పడింది. ఈ నెల 3, 4 తేదీల్లో ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పర్యటన రద్దయింది. మెదక్, కరీంనగర్ జిల్లాల్లో అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ, పర్యటన రద్దుకు గల కారణాలను వెల్లడించలేదు.గతంలో వరంగల్‌లో ఓ కార్యక్రమం, ఖమ్మంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం, కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ వైద్య కళాశాల రజతోత్సవ వేడుకలకు హాజరయ్యేలా షెడ్యూల్ ఖరారైనా, అవి కూడా వాయిదా పడ్డాయి.

పార్టీ బలోపేతమే లక్ష్యం

అమిత్ షా చివరిసారిగా 2024 మేలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణకు వచ్చారు. ఆ తర్వాత ఆయన పర్యటనలు పలుమార్లు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 2 పర్యటనపై బీజేపీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై బీజేపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సహా పార్టీ అగ్రనేతలు రానున్న రెండు నెలల్లో రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్‌ను వెంటాడుతున్న మంచినీటి సంక్షోభం

నగరానికి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరా

హైదరాబాద్ నగరంలో కోటిన్నరకు పైగా జనాభా తాగునీటి కోసం జలమండలిపై ఆధారపడుతోంది. సాధారణంగా రోజు విడిచి రోజు అందించే నీటి సరఫరా.. ప్రస్తుతం మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మంజీరా, సింగూరు, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం ఇందుకు కారణంగా మారింది. నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావం

తెలంగాణలో 600కు పైగా మండలాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6,000కు పైగా చెరువులు, కుంటల్లో కేవలం 500 చెరువుల్లో మాత్రమే కొంతమేర నీటి నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలపైనా ప్రభావం పడుతోంది.హైదరాబాద్‌లోని 16 మండలాల్లో కేవలం మూడు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైనట్లు సమాచారం. దీంతో భూగర్భ జలాల మట్టాలు మరింత పడిపోయాయి. బోర్లు, ఇతర స్థానిక నీటి వనరులపై ఆధారపడే ప్రాంతాల్లోనూ నీటి కొరత పెరుగుతోంది.

ట్యాంకర్ల కోసం గంటల తరబడి ఎదురుచూపులు

నగరంలో మంచినీటి సరఫరా తగ్గడంతో ప్రజలు వాటర్ ట్యాంకర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. జలమండలి వద్ద రోజుకు సగటున 6,000 నుంచి 8,000 ట్యాంకర్ల బుకింగ్స్ నమోదవుతున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సహా నగర శివారు ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గడంతో ప్రజలు ట్యాంకర్ల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్యాంకర్లకు డిమాండ్ మరింత పెరుగుతోంది.

సింగూరులో 3.4 టీఎంసీలే నీటి నిల్వ

నగరానికి ప్రధాన నీటి వనరులుగా ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. నీటిపారుదల శాఖ వివరాల ప్రకారం..జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం ప్రస్తుతం నిల్వ

1. ఉస్మాన్ సాగర్	3.5 టీఎంసీలు	2.2 టీఎంసీలు
2. హిమాయత్ సాగర్	2.5 టీఎంసీలు	2.1 టీఎంసీలు
3. నాగార్జునసాగర్	312 టీఎంసీలు	184.2 టీఎంసీలు
4. సింగూరు	29.9 టీఎంసీలు	3.4 టీఎంసీలు

సింగూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అత్యంత ఆందోళనకరంగా మారాయి.
29.9 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ జలాశయంలో ప్రస్తుతం 3.4 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరుల్లో నిల్వలు తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయ నీటి సరఫరా మార్గాలపై అధికారులు దృష్టి సారించారు.

గోదావరి జలాల మళ్లింపునకు ఏర్పాట్లు

జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా జలమండలి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నా రు. ఇందులో భాగంగా గోదావరి జలాలను నగరానికి మళ్లించే చర్యలు చేపడుతున్నారు.వెలిమెల వద్ద గోదావరి రింగ్ మెయిన్ పైప్‌లైన్‌ను మంజీరా ఫేజ్–3, ఫేజ్–4 గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్లతో అనుసంధానించే పనులు కొనసాగుతున్నాయి. ఈ మార్గాల ద్వారా నగరానికి నీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులు భావిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని జలమండలి అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణ ప్రతిపాదనలు కీలక దశకు చేరుకున్నాయి. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త మెట్రో కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ విస్తరణతో ఐటీ కారిడార్, పాతబస్తీతో పాటు నగర శివారు ప్రాంతాలకు మెట్రో సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఐదు కొత్త కారిడార్లు ఇవే

మెట్రో ఫేజ్–2లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానించేలా ఐదు మార్గాలను ప్రతిపాదించారు.– నాగోల్–శంషాబాద్ విమానాశ్రయం: 36.8 కి.మీ.– రాయదుర్గం–కోకాపేట: 11.6 కి.మీ.– ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట: 7.5 కి.మీ.– మియాపూర్–పటాన్‌చెరు: 13.4 కి.మీ.– ఎల్బీనగర్–హయత్‌నగర్: 7.1 కి.మీ.ఈ మార్గాల్లో నాగోల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న కారిడార్ అత్యంత పొడవైనది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు వేగవంతమైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించడం ఈ మార్గం ప్రధాన ఉద్దేశం.

ఐటీ కారిడార్‌కు ఊరట

రాయదుర్గం–కోకాపేట మార్గంతో ఐటీ, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాలకు మెట్రో సేవలు చేరువకానున్నాయి. మియాపూర్–పటాన్‌చెరు కారిడార్ అందుబాటులోకి వస్తే పశ్చిమ హైదరాబాద్‌లోని నివాస, పారిశ్రామిక ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. ఎల్బీనగర్–హయత్‌నగర్ మార్గం తూర్పు హైదరాబాద్ వైపు ప్రజా రవాణా అవసరాలను తీర్చడంలో కీలకం కానుంది.

ప్రైవేటు స్కూళ్ల అనుమతుల్లో రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

అనుమతులు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఓసీ) ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే డబ్బులు చెల్లించినప్పటికీ హామీ ఇచ్చిన అనుమతులు ఇప్పించలేదని పాఠశాలల యాజమాన్యాలు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ వ్యవహారంలో సుమారు 177 పాఠశాలలు ప్రభావితమైనట్లు దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. చెన్నై పోలీసుల సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. డిజిటల్ ఆధారాలు, విచారణలో సేకరించిన వాంగ్మూలాల ఆధారంగా అన్బిల్ మహేశ్‌ను కూడా నిందితుడిగా చేర్చినట్లు సమాచారం.

ముందస్తు బెయిల్ తిరస్కరణ.. ఆ వెంటనే అరెస్ట్

తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ అన్బిల్ మహేశ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే సోమవారం న్యాయ మూర్తి జస్టిస్ వి. లక్ష్మీనారాయణ ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. అనంతరం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనలను కూడా పోలీసులు ప్రయోగించినట్లు సమాచారం. మరోవైపు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో ఆరోపణలు ఇంకా న్యాయపరంగా నిరూపితం కావాల్సి ఉంది.

పార్టీ ఫండ్ పేరుతో వసూళ్ల ఆరోపణలు

తమిళనాడు ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య కార్యదర్శి ఇళంగోవన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు బీటీ అరసు కుమార్‌తో పాటు మరికొందరి పాత్రపైనా తొలుత ఆరోపణలు వచ్చాయి.మంత్రిగా ఉన్న సమయంలో పార్టీ ఫండ్ పేరుతో సుమారు వెయ్యి ప్రైవేటు పాఠశాలల నుంచి నగదు సేకరించినట్లు వచ్చిన ఆరోపణలు కూడా ఈ వ్యవహారంలో ప్రస్తావనకు వచ్చాయి. అయితే దర్యాప్తులో గుర్తించినట్లు చెబుతున్న 177 పాఠశాలలు, ఆరోపణల్లో పేర్కొన్న వెయ్యి పాఠశాలల సంఖ్య వేర్వేరు సందర్భాలకు సంబంధించినవిగా కనిపిస్తున్నాయి.

మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు

ఈ వ్యవహారంలో అక్రమంగా సేకరించిన డబ్బు లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దృష్టి సారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. అక్రమ వసూళ్ల ఆరోపణలు, వాటి ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

2016, 2021 ఎన్నికల్లో వరుస విజయాలు

అన్బిల్ మహేశ్ పొయ్యామొళి డీఎంకేలో కీలక నేతగా కొనసాగుతున్నారు. తిరువెరుంబూర్ నియోజకవర్గం నుంచి 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. 2021 నుంచి 2026 మధ్య తమిళనాడు పాఠశాల విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన అరెస్టు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

రైతులకు శాపంగా మారిన వెంచర్!

- పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్న సిద్ధులూరు రైతులు
- అరక ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో భారీ వెంచర్ నిర్మాణం
- సారోని వాగులో రాతి కట్టలు తొలగించి అక్రమ రోడ్డు నిర్మాణం, అసైన్డ్ భూమి ఆక్రమణపై ఆరోపణలు
- కలెక్టర్ కు రైతుల వినతి.. విచారణ జరపాలని విజ్ఞప్తి

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: వెంచర్ నిర్మాణంతో తమ వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి లేకుండా పోయిందని వికారాబాద్ మండలం సిద్ధులూరు గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించి పొలాలకు దారి కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.గ్రామంలో అరక ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెద్ద వెంచర్ నిర్మాణం కొనసాగుతోందని, గౌటాన్ భూమి పక్కన చేపడుతున్న ఈ నిర్మాణం కారణంగా తమ పొలాలకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు కొంత దారి కేటాయించాలని వెంచర్ నిర్వాహకులను పలుమార్లు కోరినా స్పందించడం లేదని తెలిపారు. దీంతో సాగు పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.అంతేకాకుండా సారోని వాగులో ఏర్పాటు చేసిన రాతి కట్టలను తొలగించి రోడ్డు నిర్మించారని, ప్రభుత్వ అసైన్డ్ భూమిని సైతం ఆక్రమించినట్లు ఆరోపించారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. నిబంధనల ప్రకారం తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు అవసరమైన దారి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.రైతుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిసింది. అనంతరం రైతులు తహసీల్దార్‌ను కూడా కలిసి సుమారు 50 మంది రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అధికారాల పీఠం.. "అప్పుల సుడిగుండం!"

- సవాళ్ల వలయంలో గ్రామ సర్పంచ్ లు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి గ్రామీణ ప్రాంతాల స్వపరిపాలనకు పట్టుకొమ్మలైన గ్రామ పంచాయతీలు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. డిసెంబర్ 2025లో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన పంచాయతీ ఎన్నికల అనంతరం కొలువుదీరిన నూతన సర్పంచ్‌ల పాలన ప్రస్థానం ముళ్లబాటగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నూతన సర్పంచ్‌లకు అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ అధికారాలు, ప్రత్యేక కమిటీల చైర్మన్ పదవులు వంటి అదనపు బాధ్యతలు అప్పగించి "కొత్త పవర్" ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అసలు కథ వేరేలా ఉంది. "అధికారాలు ఉన్నాయి కానీ.. చేతిలో అణా పైసా లేదు" అనే చందంగా నేడు జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌ల పరిస్థితి ఊగిసలాడుతోంది.

అప్పుల సుడిగుండం.. నిధుల కటకట!

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, నిరంతర తాగునీటి సరఫరా మరియు అత్యవసర మరమ్మతు పనులకు నిధుల విడుదల కాకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్ల (2019-2024) పాలకవర్గాల కాలం నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలతో పాటు, నూతన సర్పంచ్‌ల హయాంలో చేసిన అత్యవసర పనుల బిల్లులు సైతం ట్రెజరీల్లోనే మూలుగుతున్నాయి.ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేక, పల్లెల్లో పరువు పోకూడదనే ఉద్దేశంతో చాలా మంది సర్పంచ్‌లు వడ్డీలకు అప్పులు తెచ్చి, లేదా భార్యల పుస్తెల తాళ్ళు తాకట్టు పెట్టి మరీ పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 530 కోట్ల నుండి వేల కోట్ల మేర పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో, అప్పుల భారం భరించలేక నిర్మల్ జిల్లా తానూరు మండలం బోరిగావ్ సర్పంచ్ పల్లె జ్యోతి వంటి వారు బలవన్మరణాలకు పాల్పడటం క్షేత్రస్థాయి విషాదకర పరిస్థితికి అద్దం పడుతోంది.

'చెక్ పవర్' చుట్టూ రాజకీయ చదరంగం!

నూతన సర్పంచ్‌లకు పెద్ద తలనొప్పిగా మారింది గ్రామాల్లోని అంతర్గత రాజకీయాలు మరియు "జాయింట్ చెక్ పవర్" విధానం. పంచాయతీ నిధుల డ్రా కోసం సర్పంచ్‌తో పాటు ఉప-సర్పంచ్ డిజిటల్ సంతకం (డిజిటల్ కీ) తప్పనిసరి కావడం ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలకు దారితీస్తోంది.సర్పంచ్ ప్రతిపాదించిన బిల్లులపై ఉప-సర్పంచ్‌లు ఉద్దేశపూర్వకంగా సంతకాలు చేయకుండా కాలయాపన చేయడం, లేదా రాజకీయ కక్షలతో 7 రోజుల డెడ్‌లైన్‌ను దాటవేయడం వంటి ఘటనలు జిల్లావ్యాప్తంగా నిత్యకృత్యమయ్యాయి. దీనివల్ల సర్పంచ్‌ల చెక్ పవర్ తాత్కాలికంగా రద్దు కావడం, గ్రామాల్లో పాలన స్తంభించిపోవడంతో సర్పంచ్‌ల సంఘాలు కలెక్టరేట్ల చుట్టూ, నిరసన దీక్షల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది

అంగన్ వాడీల పర్యవేక్షణ: అదనపు భారమేనా?

సర్పంచ్‌లను ప్రసన్నం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక కీలక అడుగు వేసింది. గత రెండేళ్లుగా సక్రమ పర్యవేక్షణ లేక పక్కదారి పట్టిన అంగన్‌వాడీ పౌష్టికాహార పంపిణీని అదుపులోకి తెచ్చేందుకు, ప్రతి కేంద్రానికి సర్పంచ్ చైర్మన్‌గా 11 మందితో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రతినెలా గర్భిణులు, బాలింతలకు అందే ఆరోగ్యలక్ష్మి భోజన నాణ్యతను తనిఖీ చేసే అధికారం సర్పంచ్‌లకే దక్కింది.అయితే, ఈ నిర్ణయంపై అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా, సర్పంచ్‌లు మాత్రం "మాకు కావలసింది అంగన్‌వాడీల తనిఖీలు కాదు.. గ్రామాల్లో మురికి కాలువలు సాఫ్ చేయడానికి, బ్లీచింగ్ పౌడర్ కొనడానికి నిధులు" అంటూ పెదవి విరుస్తున్నారు.

ఆశాదీపంగా మారనున్న 'పంచాయతీరాజ్ నూతన చట్ట సవరణ బిల్లు'

ఈ తీవ్ర నిధుల సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో 'పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం:1. కేంద్ర ప్రభుత్వం (16వ ఆర్థిక సంఘం) నుంచి వచ్చే గ్రాంట్లు (దాదాపు 80% వాటా నేరుగా గ్రామ పంచాయతీలకే) ఎక్కడా ఆగకుండా సర్పంచ్‌ల జాతీయ గ్రామీణ నిధుల ఖాతాల్లోకి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.2. ప్రభుత్వ అనుమతితో నిధులను కమర్షియల్ బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో డిపాజిట్ చేసుకునే మరియు డ్రా చేసుకునే వీలు కల్పిస్తున్నారు.3. రాబోయే ఐదేళ్లలో (2026-27 నుండి 2030-31 వరకు) సుమారు రూ. 9,968 కోట్ల కేంద్ర నిధులు రానుండటంతో, నేరుగా ఖాతాల్లోకి నిధుల బదిలీ విధానం అమల్లోకి వస్తేనే సర్పంచ్‌ల కష్టాలు తీరతాయని భావిస్తున్నారు

ప్రజావాణి కేవలం ప్రకటనలకే పరిమితమా?

- ప్రజావాణికి డుమ్మా... మఠంపల్లిలో అధికారుల తీరుపై విమర్శలు
- సమయానికి రాని అధికారులు...గంటల తరబడి నిరీక్షణలో ప్రజలు

ప్రజా వాయిస్ | మఠంపల్లి | అక్టోబర్ 26 ప్రజల గోడు వినడానికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మఠంపల్లి మండలంలో అపహాస్యం పాలవుతుంది.అధికారుల గైర్హాజరుతో ప్రజావాణి నీరుగారుతుంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దారుణ పరిస్థితి నెలకొంది. ఉదయం 11:15 గంటలు దాటినా వివిధ శాఖల అధికారులు కార్యాలయాలకు రాలేదు. సూపరింటెండెంట్ విజయలక్ష్మి ఒక్కరే హాజరయ్యారు. దీంతో తమ సమస్యలు చెప్పుకునేందుకు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది.తమ కష్టాలు తీరుతాయని ఆశతో మండల కేంద్రానికి వస్తే, వినే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమయానికి రాకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణి అంటేనే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపడం. కానీ బాధ్యత గల అధికారులే తప్పనిసరి కార్యక్రమానికి డుమ్మా కొట్టడం ఎంతవరకు సమంజసం అని మండల ప్రజలు మండిపడు తున్నారు.సమయపాలన పాటించని అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి తప్పనిసరిగా సకాలంలో హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని మఠంపల్లి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగేళ్లుగా పిల్లర్లకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్.!

- రూ.7.20 కోట్లతో మంజూరు.. బిల్లులు చెల్లించక నిలిచిన పనులు
- రూ.1.20 కోట్ల బిల్లు ఆమోదం.. పేమెంట్ కాలేదు
- నిధుల కొరతతో కాంట్రాక్టర్ వెనకడుగు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముందుకు సాగని నిర్మాణం
- మరో నిర్మాణానికి వినియోగించుకోవాలని సూచించిన ప్రభుత్వం

ప్రజా వాయిస్,కోదాడ: రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు. నాలుగేళ్లుగా పిల్లర్లకే పరిమితమైన పనులు బేస్‌మెంట్ దశను కూడా దాటకపోవడం విమర్శలకు తావిస్తోంది.2019లో రూ.7.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.1.20 కోట్ల మేర బిల్లులు నమోదైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటికి చెల్లింపులు జరగలేదని సమాచారం. బిల్లులపై కాంట్రాక్టర్ నిధులు కోరగా, మున్సిపాలిటీలో నిధులు లేవని సమాధానం రావడంతో పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కాలేదని స్థానికంగా చర్చ జరుగుతోంది. మరోవైపు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని కొనసాగించకుండా, అదే స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టి వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు సమాచారం. దీంతో ఇప్పటికే ప్రారంభించిన పనుల భవిష్యత్తుపై స్పష్టత కరువైంది.రైతులకు ఉపయోగపడాల్సిన మార్కెట్ నిర్మాణం ఇలా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్కెట్ పూర్తయితే అన్ని రకాల మార్కెట్లు ఒకే చోటుకి వచ్చి ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందనే పట్టణ ప్రజల ఆశలు ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిర్మాణంపై స్పష్టమైన నిర్ణయం తీసుకొని, స్థలాన్ని ప్రజోపయోగానికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బీబీనగర్‌లో యాదాద్రి వైన్స్‌పై ఆరోపణలు

- అధికారులు స్పందించరా?

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని యాదాద్రి వైన్స్ నుంచి బెల్ట్ షాపులకు పెద్ద మొత్తంలో మద్యం సరఫరా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గతంలో వార్తలు ప్రచురించినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వైన్స్ వెనుక భాగంలో ఉన్న పర్మనెంట్ రూమ్‌లలో బాత్రూంలు, నీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేవని స్థానికులు చెబుతున్నారు. కుటుంబాలు నివసించే రెసిడెన్షియల్ ప్రాంతంలో ఇలాంటి పర్మనెంట్ రూమ్‌లకు అనుమతులు ఎలా మంజూరయ్యాయో అధికారులు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా బ్రాహ్మణపల్లి రోడ్డుకు వెళ్లే క్రాసింగ్ వద్ద వైన్స్ ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులను అధికారులు వెంటనే పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పర్మనెంట్ రూమ్‌లను తొలగించాలని కుటుంబాలు కోరుతున్నాయి.ప్రజల ఆరోగ్యం, భద్రత, శాంతి భద్రతల దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

చేవెళ్ల ఆర్డీవో ఆఫీసులో ఇదేం దొంగాట?

- భూభారతి దరఖాస్తులకు దిక్కేది..?
- రైతులకు న్యాయమేది..?
- సమస్య తీర్చమని వస్తే.. కొత్త సమస్యను మెడకు చుడుతున్నారు.
- ఇదేంటని అడిగేతే.. ఫైళ్లు ఏమయ్యాయో తెలీదు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ నిర్లక్ష్యపు సమాధానాలు
- అధికారులూ ఇప్పటికైనా కళ్లు తెరవండి
- ఫైళ్ల ఆచూకీ తేల్చి రైతులకు న్యాయం చేయండి!

చేవెళ్ల (ప్రజావాయిస్): రైతు దరఖాస్తు ఇస్తాడు.. కార్యాలయం స్వీకరిస్తుంది.. పరిష్కారం కోసం ఎదురుచూస్తాడు. కానీ నెలలు గడిచాక తన ఫైలు గురించి అడిగితే "ఫైలు లేదు.. ఎక్కడుందో తెలియదు.. మళ్లీ దరఖాస్తు చేసుకోండి" అనే నిర్లక్ష్యపు సమాధానం వస్తే? ఇది కార్యాలయమా.. రైతును తిప్పే కేంద్రామా? భూమి సమస్యతో వచ్చిన రైతుకు న్యాయం చేయాల్సిన చోటే కొత్త సమస్య ఎదురవుతోందన్న ఆరోపణలు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయ పని తీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.మొయినాబాద్ మండలానికి చెందిన రైతులు భూసమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో కనిపించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ ఫైళ్ల పరిస్థితి ఏమిటని అడిగితే.. "ఫైలు ఇక్కడ లేదు.. ఎక్కడుందో తెలియదు.. మళ్లీ దరఖాస్తు చేసుకోండి" అంటూ సమాధానాలు ఇస్తున్నారని వాపోతున్నారు. ఏళ్ల తరబడి భూమి సమస్యలతో సతమతమవుతున్న రైతులకు పరిష్కారం చూపాల్సింది పోయి, మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ ప్రారంభించమని చెప్పడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.

ఫైలు పోయిందా..? బాధ్యత పోయిందా..?

ప్రభుత్వ కార్యాలయంలో రైతు సమర్పించిన దరఖాస్తు సాధారణ కాగితం కాదు.. అది అతని భూమి హక్కుకు సంబంధించిన ఆధారం. దాని వివరాలు నమోదు చేయడం, భద్రపరచడం, పురోగతిని పర్యవేక్షించడం కార్యాలయ బాధ్యత. మరి ఫైలు కనిపించకపోతే దాన్ని గుర్తించాల్సింది ఎవరు? రికార్డులు పరిశీలించాల్సింది ఎవరు? రైతుకు సమాధానం చెప్పాల్సింది ఎవరు?ఫైలు కనిపించకపోతే రైతే మళ్లీ మొదటి నుంచి తిరగాలా? అధికారుల బాధ్యత మాత్రం గాలిలో కలిసిపోవాలా? అంటూ రైతులు మండిపడుతున్నారు.

ఉన్నతాధికారులూ.. ఇకనైనా స్పందించండి!చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు కనిపించడం లేదన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి. మొయినాబాద్ మండల రైతులు సమర్పించిన దరఖాస్తుల వివరాలను రికార్డులతో సరిపోల్చి, ఫైళ్ల ఆచూకీ గుర్తించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రైతులను మళ్లీ దరఖాస్తుల పేరుతో తిప్పకుండా వారి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ముధోల్‌లో 'రెండు వర్గాల' రగడ

- దిక్కుతోచని స్థితిలో కార్యకర్తలు
- లీడర్ల ఆధిపత్య పోరులో నలిగిపోతున్న 'హస్తం క్యాడర్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి
ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అంతరంగా విబేధాలు ముదిరి పాకాన పడ్డాయి. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడం పక్కనబెట్టి,అగ్ర నేతలు 'ఎవరికి వారే యమునా తీరే "అన్నట్లుగా గ్రూపు రాజకీయం నడుపుతుండటంతో కిందిస్థాయి కార్యకర్తలు తీవ్ర నిరాశ, నిస్పృహలలో మునిగిపోయారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ స్పష్టంగా రెండు వర్గాలుగా చీలిపోవడంతో, అసలైన క్యాడర్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే ఆరోపణలు క్షేత్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి.

లీడర్ల ఆధిపత్య పోరు... సామాన్య కార్యకర్త బలి!

రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, ముధోల్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ శ్రేణులకు ఆ సంతోషం లేకుండా పోయిం ది. నియోజకవర్గంలోని ఇద్దరు ముఖ్య నేతల మధ్య నడుస్తున్న వర్గ పోరు వల్ల ద్వితీయ శ్రేణి నాయకులు,గ్రామ స్థాయి కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఒక వర్గం నిర్వహించే కార్యక్రమాలకు వెళ్తే.. మరో వర్గం నేతలు వారిని శత్రువులుగా చూస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఏ గ్రూపులో ఉండాలో తెలియక సామాన్య కార్యకర్త సతమతమవుతున్నాడు.

పట్టించుకోని పెద్దలు.. గాలికి వదిలేసిన క్యాడర్!"

పార్టీ జెండా మోయడానికి, కార్యక్రమాలకు జనాలను సమీకరించడానికి మాత్రమే మమ్మల్ని వాడుకుంటున్నారు.. ఆ తర్వాత మా కష్టసుఖాలను పట్టించుకునే వారే లేరు" అని భైంసా, లోకేశ్వరం, కుబీర్, మరియు తానూర్ మండలాలకు చెందిన కిందిస్థాయి కార్యకర్తలు అంతర్గతంగా మండిపడుతున్నారు.స్థానికంగా ఏదైనా సమస్య వస్తే అధికారుల దగ్గరకు వెళ్లి చెప్పుకుందామన్నా, లీడర్ల నుంచి సరైన మద్దతు దొరకడం లేదని వాపోతున్నారు. నాయకులు కేవలం హైదరాబాద్, నిర్మల్ రాజకీయాల్లో లేదా వారి సొంత వర్గాలను కాపాడుకోవడంలోనే బిజీగా ఉంటూ, క్షేత్రస్థాయిలో నిజాయితీగా పని చేసే కార్యకర్తలను గాలికి వదిలేశారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

నిరాశలో హస్తం శ్రేణులు... ప్రతిపక్షాలకు వరంగా మారుతుందా?

ముధోల్ కాంగ్రెస్‌లో రగులుతున్న ఈ అంతర్గత అసంతృప్తి కిందిస్థాయి క్యాడర్‌లో నైరాశ్యాన్ని నింపుతోంది.ఎంతో ఆశతో పార్టీ కోసం పని చేస్తుంటే, కనీస గుర్తింపు కూడా దక్కకపోవడంతో చాలా మంది గ్రామ స్థాయి లీడర్లు సైలెంట్ అయిపోతున్నారు. నాయకత్వ లోపం మరియు సమన్వయ లేమి ఇలాగే కొనసాగితే, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ గ్రూపు తగాదాలు ప్రతిపక్ష పార్టీలకు రాజకీయంగా అస్త్రంగా మారనున్నాయి ఇప్పటికైనా నియోజకవర్గ నేతలు మేల్కొని పార్టీని కాపాడుకునే దిశగా ప్రయత్నాలు చేస్తే తప్ప రాబోయే రోజుల్లో పార్టీ ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది

బియ్యం ధరలకు రెక్కలు.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?

- మార్కెట్ లో నిల్వలు ఉన్నా కొరత ప్రచారం
- దళారుల తీరుపై ఆరోపణలు

ప్రజా వాయిస్ మంథని మార్కెట్‌లో బియ్యం సరిపడా అందుబాటులో ఉన్నప్పటికీ, కొరత ఉందంటూ కొందరు దళారులు ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా బియ్యం ధరలు పెరుగుతున్నాయని, సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి, మార్కెట్‌లో బియ్యం నిల్వలు, ధరలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెసిడెన్షియల్ కాలనీలో కమర్షియల్ ఆసుపత్రి

- బిక్కుబిక్కుమంటున్న కాలనీవాసులు!

ప్రజా వాయిస్/ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా కేంద్రంలోనిరెసిడెన్షియల్ ఇళ్ల మధ్యలో కమర్షియల్ ఆసుపత్రి నిర్వహణపై స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీనా నగర్ కాలనీలోని వినూత్న ఆర్థోపెడిక్ జనరల్ హాస్పిటల్ కారణంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు.ఆసుపత్రి వెనుక భాగంలో ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేసి ఉంచడం తమలో భయాందోళనలకు కారణమవుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించినదిగా ఉండటంతో రోగులు, వారి బంధువుల రాకపోకలు అధికంగా ఉంటున్నాయని, కొన్నిసార్లు రోగుల ఆర్తనాదాలు, రాత్రివేళల్లో ఏర్పడే శబ్దాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు అంటున్నారు.అదేవిధంగా విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో జనరేటర్ వినియోగం వల్ల వచ్చే శబ్దంతో రాత్రివేళల్లో ప్రశాంతత లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. నివాస ప్రాంతంలో ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక మరియు ఇతర అనుమతులను సంబంధిత అధికారులు పరిశీలించాలని వారు కోరుతున్నారు.అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన ఏంటి?రెసిడెన్షియల్ ప్రాంతంలో కమర్షియల్ ఆసుపత్రి నిర్వహణపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆసుపత్రికి సంబంధించిన అన్ని అనుమతులు, భద్రతా ప్రమాణాలు, ఆక్సిజన్ సిలిండర్ల నిల్వ విధానం, జనరేటర్ వినియోగం తదితర అంశాలపై అధికారులు తనిఖీ చేయాలని కోరుతున్నారు."మా పిల్లలు, వృద్ధులు ప్రశాంతంగా జీవించే పరిస్థితి ఉండాలి. ఆసుపత్రి నిర్వహణ వల్ల కాలనీవాసులకు ఇబ్బందులు ఉంటే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు కోరుతున్నారు.కాలనీ నుంచి ఆసుపత్రిని తరలించాలివినూత్న ఆర్థోపెడిక్ జనరల్ హాస్పిటల్‌ను నివాస ప్రాంతానికి దూరంగా కమర్షియల్/వైద్య సేవలకు అనుకూలమైన ప్రాంతానికి మార్చాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి, ప్రజల భద్రతకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

పాల్వాయిలో అనుమతులు లేని వెంచర్ కలకలం

- గుడిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిబంధనలు ఉల్లంఘించి ప్లాట్ల విక్రయాలు
- సర్వే నంబర్ 163/3పై సమగ్ర విచారణకు డిమాండ్

అక్రమాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని నల్ల నందుబాబు ఫిర్యాదు

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం,నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలోని గుడిపల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 163/3లో అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేసి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాల్వాయి గ్రామానికి చెందిన నల్ల నందుబాబు, తండ్రి శ్రీరాములు, మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు.సదరు వెంచర్‌లో రహదారులు, మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు సాగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంచర్‌కు గ్రామపంచాయతీతో పాటు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై స్పష్టత లేదని, ఈ పరిస్థితుల్లో ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సర్వే నంబర్ 163/3కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, భూమి యాజమాన్య వివరాలు, భూ వినియోగ స్థితిని పరిశీలించాలని నల్ల నందుబాబు అధికారులను కోరారు. వెంచర్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం రహదారులు, డ్రైనేజీ తదితర సదుపాయాలు కల్పించారా? అనే అంశాలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనుమతులు లేకుండా వెంచర్ అభివృద్ధి లేదా ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత శాఖల ద్వారా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు మోసపోకుండా ఉండేందుకు అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఫిర్యాదుదారుడు విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.

ప్రైవేటు ఆన్‌లైన్ సెంటర్‌గా మారిన చందానగర్ జలమండలి కార్యాలయం

- ఓ మహిళా ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ చేతివాటం?
- ప్రతి పనికీ ఓ రేటు? వాటర్ కనెక్షన్ల పేరుతో వసూళ్ల దందా కొనసాగుతోందా?
- ఇందులో అవినీతి అధికారుల వాటా ఎంత?
- అధికారికంగా రూ.200 చార్జీ.. వినియోగదుడి నుంచి రూ.3,000 వసూలు చేసినట్లు ఆరోపణలు!
- సిబ్బంది గూగుల్ పే, ఫోన్ పే లావాదేవీలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం!



HMWSSB
HYDERABAD METROPOLITAN WATER SUPPLY & SEWERAGE BOARD

చందానగర్: ప్రజా వాయిస్, ప్రజలకు తాగునీటి సేవలు అందించాల్సిన జలమండలి కార్యాలయం ప్రైవేటు ఆన్‌లైన్ సెంటర్‌ను తలపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటర్ కనెక్షన్లకు సంబంధించిన దరఖాస్తులు, వివరాల మార్పులు తదితర పనుల కోసం ప్రతి అంశానికి ఓ రేటు నిర్ణయించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జలమండలిలోని ఇతర కార్యాలయాల పరిధిలో ఉన్న వాటర్ కనెక్షన్లకు సంబంధించిన దరఖాస్తులు సైతం చందానగర్ కార్యాలయంలోనే స్వీకరిస్తున్నట్లు, ఈ వ్యవహారం కొన్నేళ్లుగా కొనసాగుతోందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.200 అధికారిక చార్జీ.. రూ.3,000 వసూలు చేశారా?

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఓ వినియోగదారుడు తన పూర్వీకుల పేరుపై ఉన్న ఇంటిని తన పేరుపైకి మార్చుకున్న అనంతరం, సంబంధిత పత్రాల ఆధారంగా వాటర్ కనెక్షన్‌లోని వివరాలను కూడా మార్చుకునేందుకు చందానగర్ జలమండలి కార్యాలయాన్ని సంప్రదించినట్లు సమాచారం. ఈ ప్రక్రియకు ఎంత ఖర్చవుతుందని విచారించగా, అధికారిక చార్జీలు రూ.200 మాత్రమే ఉండగా, మొత్తం రూ.3,000 వసూలు చేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన మొత్తానికి, వసూలు చేసినట్లు చెబుతున్న మొత్తానికి మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకు వచ్చింది? అదనంగా వసూలు చేసిన రూ.2,800 ఎవరికి చేరింది? ఈ మొత్తాన్ని ఎవరు తీసుకున్నారు? అధికారుల ప్రమేయం ఉందా? లేక మధ్యవర్తుల పాత్ర ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

డిజిటల్ లావాదేవీలపై విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వస్తాయా?

ఈ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గుతేల్చాలంటే చందానగర్ జలమండలి కార్యాలయంలో వాటర్ కనెక్షన్లకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్న సిబ్బంది, సంబంధిత మధ్యవర్తులపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు, రసీదులు, దరఖాస్తులు, అధికారిక చార్జీల వివరాలతో పాటు, చట్టబద్ధమైన విధానాల్లో సంబంధిత డిజిటల్ చెల్లింపుల రికార్డులను పరిశీలిస్తే అక్రమ వసూళ్లు జరిగాయా లేదా అన్నది నిర్ధారించే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి!

పేద వినియోగదారులు తమ ఇంటి పత్రాలను సరిచేసుకోవడానికి, వాటర్ కనెక్షన్ వివరాలను మార్చుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అదనపు ఆర్థిక భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడితే అది తీవ్ర ఆందోళనకరమైన విషయం. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాల్సిన కార్యాలయాల్లో ఇలాంటి ఆరోపణలు రావడం జలమండలి ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశం.కాబట్టి జలమండలి ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై తక్షణమే స్పందించి, సంబంధిత దరఖాస్తులు, అధికారిక రుసుములు, వసూళ్ల వివరాలపై విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలి. అక్రమ వసూళ్లు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అందాల్సిన సేవలు డబ్బులు చెల్లించే వారికే పరిమితం కాకుండా, నిబంధనల ప్రకారం ప్రతి వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలి.

జాతీయ రహదారి 563తో శ్రీనివాస్ నగర్ ప్రజలకు ఇబ్బందులు

- పొలాలకు దారి, సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి

ప్రజా వాయిస్, మానకొండూరు(అక్టోబర్ 26): కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం శ్రీనివాస్ నగర్ గ్రామంలో జాతీయ రహదారి 563 నిర్మాణం కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. రహదారి నిర్మాణంతో పొలాలకు వెళ్లే మార్గంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వర్షపు నీరు గ్రామంలోకి చేరి పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు, అండర్‌పాస్ సౌకర్యాలు లేకపోవడంతో రైతులు, పశువులు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై అక్టోబర్ 26న కరీంనగర్ ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు సంఖ్య DKARM26102600033గా నమోదై ఆర్ డి ఓ కార్యాలయానికి పంపినట్లు అందిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం 35 మంది రైతులు సంతకాలతో తమ మద్దతు తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఇబ్బందులను పరిశీలించి, పొలాలకు సురక్షితమైన దారి కల్పించడంతో పాటు సర్వీస్ రోడ్డు, అండర్‌పాస్, వర్షపు నీటి మళ్లింపు సౌకర్యాలపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.a

అక్రమ రేషన్ బియ్యం విక్రయాలను అరికట్టాలని వినతి

- ప్రజావాణిలో అధికారులకు నాయకుల పిర్యాదు
- తెలంగాణ రక్షణ సేన మండల ఇన్ చార్జి బొబ్బిలి సుధాకర్.

ప్రజావాయిస్ టేక్మాల్ :టేక్మాల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ విక్రయాలు, కొనుగోళ్లను అరికట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ టేక్మాల్ మండల ఇన్‌చార్జి బొబ్బిలి సుధాకర్ మరియు కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాన్ని సమర్పించారు.ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం రేషన్ కార్డుదారులకు ప్రతి నెల ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు బయట వ్యక్తులకు అక్రమంగా బియ్యన్ని విక్రయిస్తున్నారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు వాహనాలపై గ్రామాల్లోకి వచ్చి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమంగా బియ్యం విక్రయిస్తున్న కార్డుదారులు, కొనుగోలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.కావున, టేక్మాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, రేషన్ బియ్యం అక్రమ విక్రయాలు, కొనుగోళ్లకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఓటు రక్షణే.. దేశ రక్షణ!

- మొయినాబాద్ లో 'ఓట్ బచావో దేశ్ బచావో' సమావేశం
- నవంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ
- విజయవంతం చేయాలని ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం పిలుపు

మొయినాబాద్ (ప్రజావాయిస్): ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం, అబ్జర్వర్ అఫ్సర్ జేసోషీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతం చేయడమే 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచాలంటే ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రామ్ లీలా మైదాన సభను విజయవంతం చేయాలి

నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ కోరారు. చేవెళ్ల నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, నాయకులు గౌరీ సతీష్, ఏనుగు జంగారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ అమీర్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ,షాబాద్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో ఆకాశమంత అక్రమ నిర్మాణం

- నిర్మాణం ఆగేదెప్పుడు.. అధికారుల కళ్లు తెరిచేదెప్పుడు?
- 111జీవో ఉల్లంఘనలు ఉన్నా ఉపేక్ష ఎందుకో..?
- ఏసీబీ పట్టుకున్నా మారని తీరు
- పద్మావతిలో ఆగని నిర్మాణాల జోరు!

మొయినాబాద్ (ప్రజావాయిస్):అజీజ్ నగర్లోని పద్మావతి వెంచర్లో అక్రమ నిర్మాణం ఆకాశాన్ని తాకుతోంది.కొనసాగుతున్న భారీ నిర్మాణంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోనే ఇదే అతిపెద్ద అక్రమ నిర్మాణమని వారు పేర్కొంటూ.. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇటీవల అక్రమ నిర్మాణానికి సంబంధించిన వ్యవహారంలో ఓ అధికారి ఏసీబీకి పట్టుబడిన ఘటన మొయినాబాద్‌లో చర్చనీయాంశమైంది. ఇలాంటి ఘటన తర్వాతైనా నిర్మాణాలపై పర్యవేక్షణ కట్టుదిట్టం కావాలని ప్రజలు ఆశించారు. కానీ పద్మావతి వెంచర్‌లో భారీ నిర్మాణం కొనసాగుతోందన్న స్థానికుల వాదనతో అధికారుల తనిఖీలు, పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఏం చేస్తోందన్న చర్చ మొదలైంది. అజీజ్‌నగర్‌లోని పద్మావతి వెంచర్‌పై అధికారులు తక్షణమే స్పందించాలి.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు ఇక్కడ నేతలు అక్కడ

- హైదరాబాద్ కి పరిమితమైన దుబ్బాక ముఖ్య నేతలు
- ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి తెలియక జనం అయోమయం
- కార్యక్రమాలకే ఎమ్మెల్యే హాజరు
- బిజెపిలో ఇంచార్జ్ కరువు.
- అన్ని తానే వ్యవహరిస్తున్న ఎంపీ.
- చుట్టపు చూపుగా చెరుకు పర్యటన నేతలపై ప్రజల అసంతృప్తి.

ప్రజా వాయిస్ ప్రతేక కథనం. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాలని ప్రభావితం చేసిన దుబ్బాక నియోజకవర్గం లో ప్రస్తుతం స్థానిక నాయకత్వం ప్రజలకు అందుబాటులో లేవు చర్చనీయాంశంగా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి తమ సమస్యలు ఎవరు పరిష్కరిస్తారు తెలియని పరిస్థితి నెలకొందని పలువురు స్థానికులు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో విస్తృతంగా కనిపించే నేతలు ఆ తర్వాత నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు అన్న అసంతృప్తి ఆయా పార్టీల క్యాడర్లో వ్యక్తమౌతుంది.

ప్రజలకు దూరంగా ఎమ్మెల్యే..?

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వ పార్టీ కార్యక్రమాలకు ఎక్కువగా పరిమాతమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఎక్కడైనా నియోజకవర్గానికి వచ్చిన సందర్భంలోనూ ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళు ఎందుకు తగిన అవకాశం లేకపోయిందని కొందరు కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో ప్రజా సమస్యలపై ఎవరిని ఆశ్రయించాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్లోనూ అయోమయం.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ దుబ్బాకలో మాత్రం బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండటంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో భిన్నమైన పరిస్థితి నెలకొంది. అధికారంలో ప్రభుత్వం ఉన్న నియోజకవర్గంలో తనకు రాజకీయంగా ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి కొందరు కార్యకర్తల్లో వ్యక్తం వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఇక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ కే పరిమితం అవుతున్నారన్న విమర్శలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.తరచూ నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్న అభిప్రాయాలను కాంగ్రెస్ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

బిజెపి లోను అదే తీరు

. ఇక బిజెపి పరిస్థితి మిగతా పార్టీలకు కొంత భిన్నంగా ఉన్నప్పటికీ నియోజకవర్గస్థాయిలో స్పష్టమైన నాయకత్వం లేకపోవడం కార్యకర్తలకు ఇబ్బందిగా మారిందన్న చర్చ ఉంది నియోజకవర్గ ఇన్చార్జి విషయంలో స్పష్టత లేకపోవడంతో క్యాడర్లో సంగితత నెలకొంది పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది ఇక గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన రఘునందన్ రావు ప్రస్తుతం మెదక్ ఎంపీగా ఉండటంతో ఆయన నియోజకవర్గానికి అనుకున్నంత సహాయం ఇవ్వలేకపోతున్నప్పటికీ పార్టీకి సంబంధించిన కీలక వ్యవహారాలను ఆయనే స్వయంగా చూస్తున్నారన్న అభిప్రాయం కూడా ఉంది అయితే ఎంపీ ఎక్కువగా హైదరాబాదులో ఉండటంతో కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అక్కడికి వెళ్లాల్సిన దుస్థితి నెలకుంది అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దుబ్బాక ను ఎవరు పట్టించుకునేది.....?

మూడు ప్రధాన రాజకీయ పార్టీల్లోనూ నాయకత్వం సమన్యాయం ప్రజలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలపై చర్చ జరుగుతుండడంతో దుబ్బాక రాజకీయాల్లో ఒక రకమైన శూన్యత కనిపిస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నేతలు ప్రజల్లో విస్తృతంగా తిరగకపోవడంతో కార్యకర్తలకు అందుబాటులో లేకపోవడంతో చివరికి ప్రజా సమస్యల పరిష్కారం పైన ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన దుబ్బాక ఇప్పుడు బలమైన స్థానిక నాయకత్వం కోసం ఎదురు చూస్తున్న చర్చ సాగుతుంది.

లింగన్న.....ముత్తన్న జనంతోనే.

గతంలో దుబ్బాక ఎమ్మెల్యేలుగా పనిచేసిన దివంగత నాయకులు సోలిపేట రామలింగారెడ్డి చేరుకు ముత్యంరెడ్డి నిత్యం ప్రజల్లో ఉండేవారని స్థానికులు గుర్తు చేస్తున్నారు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉండేవారని చెబుతున్నారు అందుకే వారు మరణించిన కూడా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నేతలు నియోజకవర్గం కంటే హైదరాబాదులోనే ఎక్కువగా కనిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై సమన్యాయం లోపిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏకమైన జైపూర్ జర్నలిస్టులు!

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ
- ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రెస్ భవనానికి నిధులు మంజూరు చేస్తామని వెల్లడి
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసిన జర్నలిస్టుల జేఏసీ

జైపూర్, ప్రజా వాయిస్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని జైపూర్ మండల పాత్రికేయులు నిర్ణయించారు. ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రెస్ భవనం ఏర్పాటు ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని తీర్మానించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కల్పించడంతోపాటు ప్రెస్ భవనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు జర్నలిస్టులు తెలిపారు.

హక్కుల సాధనకు ఐక్య కార్యాచరణ

జైపూర్ మండల పరిధిలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు సోమవారం ఏకమై జేఏసీగా ఏర్పాటయ్యారు. గత కొంతకాలంగా జర్నలిస్టుల మధ్య సమన్వయం కొరవడటంతో ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, ప్రెస్ భవనం వంటి ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత విభేదాలకు తావు లేకుండా వృత్తిపరమైన హక్కుల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు.

మంత్రి సానుకూల స్పందన

వేలాల పుష్కర అవార్డు పనుల ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని జర్నలిస్టుల బృందం కలిసి తమ సమస్యలను వివరించింది. విధి నిర్వహణలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కల్పించాలని, జైపూర్‌లో ప్రెస్ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రెస్ భవనమే ప్రధాన లక్ష్యం

జైపూర్ మండలంలోని జర్నలిస్టులందరికీ ఉపయోగపడేలా ప్రెస్ భవనం ఏర్పాటు చేయాలని జేఏసీ నిర్ణయించింది. జర్నలిస్టుల సమావేశాలు, వృత్తిపరమైన చర్చలు, సమాచార సమన్వయానికి ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, హామీల అమలుకు నిరంతరం కృషి చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దుస్స భూమన్నతో పాటు శ్రవణ్‌కుమార్, దుర్గాప్రసాద్, బాలరాజ్‌గౌడ్, దుస్స వివేక్, పల్లె రాజశేఖర్, , సాయి శేఖర్, రమేష్‌గౌడ్, సతీష్, వెంకటేష్, తిరుపతి, సాయిబాబా, భీమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్తరోడ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా స్టోరేజ్ గోధం నిర్మాణం

- సామాజిక కార్యకర్త పిప్పెర బోజన్న

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధినిర్మల్ జిల్లా బెల్తరోడా గ్రామంలో నిర్మించిన స్టోరేజ్ గోదాం అనుమతులు మరియు సంబంధిత నిబంధనలకు విరుద్ధంగా నిర్మించబడినట్లు ఉన్నాయి అంతేకాకుండా,ఈ గోదాం నిర్మాణానికి సంబంధించి అక్రమ మైనింగ్ జరిగిందా మట్టి,మొరం తవ్వకాలు మరియు తరలింపులకు అవసరమైన అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాలి.గోదాం నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, మైనింగ్ అనుమతులు, రోడ్డు పక్కన ఉన్న కాలువ మూసివేత వంటి అంశాలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి అని సమాజిక కార్యకర్త పిప్పేర బొజన్న డిమాండ్ చేశారు.నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి అని,ప్రజా ప్రయోజనాలే ముఖ్యం.అధికారుల జవాబుదారీతనమే లక్ష్యం.నిజానిజాలు వెలుగులోకి రావడమే మా ఆకాంక్ష ప్రశ్నించడం తప్పు కాదు.ప్రజా సమస్యలపై సమాధానం కోరడం మన హక్కు అని పేర్కొన్నారు.

నేలకొండపల్లి బౌద్ధస్తూపాన్ని ప్రపంచ పటంలో నిలుపుతాం!

- పర్యాటక అభివృద్ధి పనులకు ఘనంగా భూమిపూజ
- చారిత్రక క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకువస్తాం మంత్రి పొంగులేటి.
- గ్రామ పెద్దలతో ఆత్మీయ కలయిక
- సమగ్ర అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ
- లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

ప్రజా వాయిస్ ఖమ్మం:చారిత్రక ప్రసిద్ధి గాంచిన నేలకొండపల్లి మహా బౌద్ధస్తూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, ప్రపంచ పటంలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లా, పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలంలో మంత్రి ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.నేలకొండపల్లిలోని ప్రముఖ బౌద్ధ స్తూపం వద్ద చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఆర్కియాలజీ, టూరిజం శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యటన సందర్భంగా మంత్రి పొంగులేటి స్థానిక గ్రామస్థులు, గ్రామ పెద్దలతో ఆత్మీయంగా ముచ్చటించారు. బౌద్ధాస్థూపం గురించి వారి వద్ద నుండి విలువైన సమాచారం సేకరించారు. స్థూపం ప్రాచీన విశిష్టత, ఇప్పటివరకు చేపట్టిన తవ్వకాలు, ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ—— దక్షిణ భారతదేశంలోనే విశిష్ట గుర్తింపు పొందిన నేలకొండపల్లి బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని, దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా సకల మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. నేలకొండపల్లి రూపురేఖలు మార్చేలా నిధులు కేటాయించి, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.అనంతరం నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పాల్గొన్నారు. మండలంలోని అర్హులైన పేదలకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను (ప్రొసీడింగ్స్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సొంతింటి కల ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.రైతులు రెండో పంట వేసి నష్టపోవద్దుఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, సగానికి పైగా బోర్లు ఎండిపోయిన దుస్థితి నెలకొందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతన్నలు ఆవేశపడి రెండో పంట వేసి పెట్టుబడులు కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి , ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, సీనియర్ సిటిజన్ ఉన్నాం వెంకయ్య, డాక్టర్ రామచందర్. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడాలి గోవింద్, జెర్రిపోతుల అంజనీ, బొడ్డు బొందయ్యా, మామిడి వెంకన్న, పసుపులేటి ఉపేందర్, పసుపులేటి శ్రీలత. సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వాణిజ్య సముదాయాల నిర్మాణం

- తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

పటాన్ చెరువు ప్రజావాయిస్ అమీన్పూర్ సర్కిల్ ప్రాంతంలోని పటేల్ గూడా లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలపై (కమర్షియల్ శెట్టిర్లపై) స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా కొందరు అక్రమంగా నిర్మిస్తున్నారని. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రధాన సమస్యలుట్రాఫిక్ రద్దీ మరియు పార్కింగ్ సమస్య: వాణిజ్య సముదాయాలకు అవసరమైన పార్కింగ్ స్థలం కేటాయించకుండానే కమర్శియల్ శెట్టర్లు నిర్మిస్తుండటంతో, రోడ్లపైనే వాహనాలు నిలిపివేయాల్సి వస్తోందని, దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.నిబంధనల ఉల్లంఘన టౌన్ ప్లానింగ్ నిబంధనలను తుంగలో తొక్కి,;సెట్‌బ్యాక్‌లను వదలకుండా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.ప్రమాదాల ముప్పు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా చేపడుతున్న ఈ నిర్మాణాల వల్ల చుట్టుపక్కల నివాసాల వారికి, పాదచారులకు ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, కొందరు అధికారుల అండదండలతోనే పనులు వేగంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపించారు. ఒకవేళ అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయకపోతే, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పరేడ్ పరిశీలన.. కిట్స్ తనిఖీ.. రికార్డుల సమీక్ష

- మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ
- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- డీఎస్పీ బి. రవి.

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను మిర్యాలగూడ డీఎస్పీ రవి సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీకి ఎస్ఐ ప్రవీణ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఐ నాగభూషణం రావు గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను డీఎస్పీ ఆసక్తిగా పరిశీలించారు. సిబ్బంది క్రమశిక్షణ, విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కిట్స్‌ను తనిఖీ చేసి, విధులకు అవసరమైన సామగ్రి, సిబ్బంది సంసిద్ధతను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల వివరాలు, పెండింగ్ కేసుల స్థితిగతులు, స్టేషన్ నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు.ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలిఈ సందర్భంగా డీఎస్పీ రవి పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని తెలిపారు.నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం పెరిగేలా అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని డీఎస్పీ సూచించినట్లు తెలిపారు.ఈ వార్షిక తనిఖీల్లో ఎస్ఐలు ప్రవీణ్, వెంకటేశ్వర్లు, బిక్షం, ఏఎస్ఐ లు గోపమ్మ, కుంచెం శ్రీను, బాషా నాయక్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న నేరాలు... శాంతిభద్రతలకు సవాల్!

- భద్రతపై ప్రజల్లో ఆందోళనసిబ్బంది కొరతతో కుదేలవుతున్న పోలీస్ వ్యవస్థ..
- నేరాల నియంత్రణలో పోలీసుల వ్యూహం ఏంటి ?
- ప్రజా భద్రతకై పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేయాలి
- సీఐని స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నియమించాలి
- డివిజనల్ పోలీస్ స్టేషన్ గా అభివృద్ధి చేసి పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్
- పాలకులు, జిల్లా అధికారులు స్పందించేది ఎప్పుడు

ప్రజా వాయిస్ | హుజూర్‌నగర్ | అక్టోబర్ 26 వ్యాపార, వాణిజ్య పరంగా మరియు రాజకీయంగా వేగంగా విస్తరిస్తున్న హుజూర్‌నగర్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారింది. ఇటీవల కాలంలో వరుసగా చోటుచేసుకుంటున్న దొంగతనాలు, హత్యలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో సరిపడా గస్తీ లేకపోవడం, ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణ లోపించడం నేరస్థులకు అనుకూలంగా మారుతోంది.

ప్రజలకు రక్షణ కావాలి... పోలీసులకు సిబ్బంది కావాలి!

పట్టణ జనాభాతో పాటు పరిధి రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, దానికి తగినట్లుగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య పెరగకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.తీవ్ర సిబ్బంది కొరత: మంజూరైన పోస్టుల కంటే చాలా తక్కువ మందితోనే పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తుండటంతో, అధికారులపై పనిభారం విపరీతంగా పెరుగుతోంది.కేసుల దర్యాప్తులో ఆలస్యం: ఒకవైపు నిరంతరం పెరిగే బందోబస్తులు, కోర్టు డ్యూటీలు, ప్రోటోకాల్ విధులతోనే ఉన్న సిబ్బంది సరిపోతుండటంతో.. నిత్యం నమోదయ్యే శాంతిభద్రతల సమస్యలు, నేరాల దర్యాప్తుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు.రాత్రి గస్తీ పై ప్రభావం: సిబ్బంది కొరత కారణంగా రాత్రి వేళల్లో సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహించడం కష్టతరంగా మారింది. ఇదే అదనుగా భావించిన దొంగలు, నేరస్థులు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు.పరిపరివిధాలా పెరుగుతున్న నేరాల తీవ్రతఇటీవల కాలంలో పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగిన కొన్ని దారుణ సంఘటనలు హుజూర్‌నగర్ ప్రజలను ఉలిక్కిపడేలా చేశాయి. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతున్న దొంగతనాలు, మద్యం మత్తులో జరుగుతున్న గొడవలు, క్షణికావేశంలో చోటుచేసుకుంటున్న హత్యలు పట్టణంలో రక్షణ గోడ ఎంత బలహీనపడిందో తెలియజేస్తున్నాయి. ప్రజలు ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి కల్పించాలంటే పోలీస్ వ్యవస్థను తక్షణమే బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

రిపరిష్కారాలు:

డివిజనల్ స్థాయికి పెంపు.. సీఐని SHO గా నియమించాలి హుజూర్‌నగర్ పట్టణ స్వభావాన్ని, పెరిగిన జనాభా మరియు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్ వ్యవస్థలో కీలక మార్పులు చేయాలని స్థానికులు, మేధావులు కోరుతున్నారుడివిజనల్ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు: హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సబ్-డివిజనల్ లేదా డివిజనల్ పోలీస్ స్టేషన్ స్థాయికి పెంచి, అధునాతన మౌలిక వసతులు, అదనపు వాహనాలు సమకూర్చాలి.సర్కిల్ ఇన్స్పెక్టర్ ను SHO గా నియమించాలి: పెరుగుతున్న నేరాల తీవ్రత దృష్ట్యా, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO) గా సబ్ ఇన్స్పెక్టర్ (SI) కంటే అనుభవం కలిగిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ను నేరుగా నియమిస్తే కేసుల విచారణ వేగవంతమవ్వడంతో పాటు శాంతిభద్రతలపై మరింత పట్టు సాధించవచ్చని అభిప్రాయపడుతున్నారు.సిబ్బంది సంఖ్య పెంచాలి: పోలీస్ స్టేషన్‌కు తగిన సంఖ్యలో ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను కేటాయించి శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది కొరతను తీర్చాలి. సీసీ కెమెరాల పెంపు & నిఘా: పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో సత్వరమే సీసీ కెమెరాల సంఖ్యను పెంచి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి.

పాలకులు, ఉన్నతాధికారులు స్పందించాలి!

ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు పోలీస్ శాఖపై ఉంది. కేవలం తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ రూపురేఖలను మార్చేలా, శాశ్వత ప్రాతిపదికన పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానవత్వాన్ని చాటుకున్న దామెర ఎస్సై వీర భద్ర రావు

- ఏళ్లుగా రోడ్డు పక్కన జీవన కొనసాగిస్తున్న వృద్ధురాలు
- సేవ భావాన్ని చూసి హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి హనుమకొండ జిల్లా దామెర మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రోడ్డు పక్కన పడుకుని ఉన్న వృద్ధురాలిని చూసి చలించిపోయిన దామెర ఎస్సై, మరుసటి రోజు ఉదయం ఆమె వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.వృద్ధురాలికి బెడ్‌షీట్లు, టవల్స్, పండ్లు, నిత్యావసర వస్తువులతో పాటు రూ.3,000 నగదు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా, ఆమె వైద్య చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.కొన్నేళ్లుగా రోడ్డు పక్కనే జీవనం సాగిస్తున్న వృద్ధురాలికి ఎస్సై అందించిన సహాయం, సేవా భావాన్ని చూసి గ్రామ మహిళలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పోలీసుల విధి నిర్వహణతో పాటు సామాజిక సేవలోనూ ముందుండటం అభినందనీయమని కొనియాడారు.

ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్‌కు మొయినాబాద్ ముస్తాబు

- ఏర్పాట్లపై ఫ్యూచర్ సిటీ సీపీ ప్రత్యేక దృష్టి
- టోర్నీ నిర్వహణకు అనువైన మైదానాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- మ్యాచ్ లు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు దిశానిర్దేశం

మొయినాబాద్ (ప్రజావాయిస్): విధి నిర్వహణలో క్రమశిక్షణ.. మైదానంలో క్రీడాస్ఫూర్తి.. ఈ రెండింటి సమ్మేళనంగా ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌కు మొయినాబాద్ వేదికగా ఏర్పాట్లు ఊపందుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల పోలీస్ జట్లు తలపడనున్న ఈ క్రీడా వేడుకకు సంబంధించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రికెట్ మైదానాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి,ఐపీఎస్, మైదానాలను సోమవారం సందర్శించారు.

మైదానాల నుంచి మౌలిక వసతుల వరకు..

టోర్నమెంట్‌లో భాగంగా రాష్ట్రాల వారీగా నిర్వహించనున్న క్రికెట్ మ్యాచ్‌లకు ఏ మైదానాలు అనువుగా ఉంటాయి? క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కల్పించాలి? మ్యాచ్‌ల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టాలి? అనే అంశాలను కమిషనర్ పరిశీలించారు. మైదానాల పరిస్థితి, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.జాతీయ స్థాయి పోలీస్ క్రీడా పోటీల నిర్వహణలో ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు కీలకం. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పోలీస్ క్రీడాకారులకు అనుకూల వాతావరణం కల్పించడంతోపాటు, మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేందుకు ముందస్తు సమన్వయం అవసరం. ఈ దిశగా మైదానాల పరిశీలన, వసతుల సమీక్ష ద్వారా ఏర్పాట్లను పటిష్ఠం చేసే ప్రయత్నం సాగుతోంది.ఈ పర్యటనలో ఐజీపీ ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, అదనపు బాధ్యతల్లో ఐజీపీ స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్‌గా వ్యవహరిస్తున్న గజరావు భూపాల్, చేవెళ్ల జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ, స్థానిక సీఐ మల్లిఖార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ప్రజా వాయిస్, కేశవపట్నం(అక్టోబర్ 26):కరీంనగర్ జిల్లా శంకరపట్నం మొలంగూరు క్రాస్ రోడ్డు వద్ద అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ టి ఎస్ 08 వి డి 9010 ను కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఊటూరు గ్రామం మానకొండూరు మండలనికి చెందిన డ్రైవర్ కనుకుంట్ల మల్లేశం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా మొరం తరలించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ శేఖర్ రెడ్డి హెచ్చరించారు.

ప్రజావాయిస్ కథనానికి స్పందన.. పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కారం!

- కళ్లముందే నీటి వృథా.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం!
- చంద్రపురి కాలనీలో 15 రోజులుగా కొనసాగిన లీకేజీకి పరిష్కారం

ప్రజావాయిస్, జవహర్ నగర్ : జవహర్ నగర్ చంద్రపురి కాలనీలో గత 15 రోజులుగా పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవుతున్న సమస్యపై ప్రజావాయిస్ ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. కాలనీలో పైపులైన్ నుంచి నీరు లీకవుతూ వృథా అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యతో విలువైన తాగునీరు వృథా కావడమే కాకుండా, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను ప్రజావాయిస్ తన కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సంబంధిత అధికారులు లీకేజీని అరికట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజా సమస్యలపై ప్రజావాయిస్ నిరంతర కృషి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రజావాయిస్ కథనానికి స్పందించి సమస్యను పరిష్కరించిన అధికార యంత్రాంగానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు ఏర్పడితే వెంటనే స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మహిళా కండక్టర్‌ను నెట్టివేసిన ప్రయాణికురాలు అరెస్ట్!

- అశ్వాపురం పోలీసుల కేసు నమోదు
- మిట్టగూడెం వద్ద ఘటనతో ఆర్టీసీ సిబ్బంది భద్రతపై ఆందోళన

ప్రజా వాయిస్ అశ్వాపురం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం ప్రాంతంలో ఆర్టీసీ బస్సులో టికెట్ విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘటనకు దారితీసింది. విధుల్లో ఉన్న మహిళా ఆర్టీసీ కండక్టర్‌ను ఓ మహిళా ప్రయాణికురాలు నెట్టివేయడంతో ఆమె రోడ్డుపై పడగా, బస్సు చక్రాలు ఆమెపై నుంచి వెళ్లడంతో కాళ్లకు తీవ్ర రక్తగాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితురాలు బానోత్ మౌనికను అరెస్టు చేసి మణుగూరు కోర్టులో హాజరుపరిచారు.

టికెట్ విషయంలో వివాదం.. మహిళా కండక్టర్ కు తీవ్ర గాయాలు

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బస్సులో టికెట్ తీసుకునే విషయంలో మహిళా ప్రయాణికురాలికి, మహిళా కండక్టర్‌కు మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు కండక్టర్‌ను బస్సులో నుంచి నెట్టివేయడంతో ఆమె రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో బస్సు ఆమెపై నుంచి వెళ్లడంతో కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి.ఈ ఘటనపై బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితురాలు బానోత్ మౌనికను అరెస్టు చేసి మణుగూరు కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతపై ఆందోళన

ప్రజలకు రవాణా సేవలు అందించే ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో ఇలాంటి ఘటనలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. టికెట్ చార్జీలు, రాయితీలు లేదా ప్రయాణ నిబంధనల విషయంలో ఏవైనా వివాదాలు తలెత్తితే వాటిని చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి. సిబ్బందిపై దాడులకు పాల్పడటం సమస్యకు పరిష్కారం కాదు. విధుల్లో ఉన్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యంపై ఉంది.

బస్సుల కొరత.. ప్రయాణికుల ఇబ్బందులపై దృష్టి సారించాలి

ఈ ఘటన నేపథ్యంలో ఆర్టీసీ సేవలపై కూడా చర్చ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల కొరత, సమయపాలన లోపాలు, రద్దీ సమయాల్లో బస్సులు కిక్కిరిసిపోవడం వంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలి.పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక సర్వీసుల చార్జీల వివరాలను పారదర్శకంగా ప్రకటించాలి. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు పురుషులతో సహా ప్రతి ప్రయాణికుడికి తగిన రవాణా సౌకర్యం కల్పించాలి.

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించాలి

గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులను పెంచడం, బస్సులు సమయానికి నడిచేలా చూడడం రద్దీని నియంత్రించడం ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలి.మిట్టగూడెం ఘటనలో పోలీసుల చర్యలు చట్ట ప్రకారం కొనసాగుతున్న నేపథ్యంలో, గాయపడిన మహిళా కండక్టర్‌కు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రయాణికుల భద్రతతో పాటు ఆర్టీసీ ఉద్యోగుల రక్షణ కూడా అంతే ముఖ్యం. ప్రజా రవాణా వ్యవస్థలో క్రమశిక్షణ, భద్రత, మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి.

యాసంగిలో వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలే మేలు!

- ఎల్ నినోతో పొంచి ఉన్న వర్షాభావ ముప్పు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వరి, మొక్కజొన్న వేసి నష్టపోవద్దు: అధికారుల హెచ్చరిక

ప్రజా వాయిస్ ఖమ్మం:రాబోయే యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే ప్రమాదం ఉన్నందున రైతులు వరి, మొక్కజొన్న పంటలను పక్కనపెట్టి, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలనే సాగు చేయాలని నేలకొండపల్లి తహసీల్దార్ స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.మండల పరిధిలోని చెన్నారం, మండ్రాజుపల్లి, కోరట్లగూడెం, చెరువుమాదారం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ పంచాయతీ వాహనాల ద్వారా ఊరూరా విస్తృత మైక్ ప్రచారం చేపట్టారు.ఈ నేలకొండపల్లి తహసిల్దార్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. విద్యుత్ లభ్యత కూడా పరిమితంగా ఉండే పరిస్థితి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న సాగు చేయడం తీవ్ర నష్టదాయకం. వీటికి బదులుగా తక్కువ కాలపరిమితి, స్వల్ప నీటితో అధిక దిగుబడులు సాధించే పెసర, మినుము, వేరుశనగ వంటి అపరాల (ఆరుతడి) పంటలను మాత్రమే సాగు చేయాలి" అని తేల్చిచెప్పారు. ప్రభుత్వ సూచనలను పాటించి రైతులు వివేకంతో వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యర్రయ్య, మండల వ్యవసాయ అధికారి రాధ, విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

రైల్వే లైన్ మళ్లిస్తే రణరంగమే.. నేరడిగొండకు అన్యాయం చేస్తే సహించేది లేదు

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ నేరడిగొండ మీదుగానే నిర్మించాలి

నేరడిగొండలో వెంటనే రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలి

ఘాట్ల సాకుతో రూట్ మళ్లించడం తీవ్ర అన్యాయం

కుంటాల, పొచ్చెర పర్యాటకానికి తీరని విఘాతం

అధికారులు రీసర్వే వివరాలను వెంటనే బహిరంగపరచాలి

న్యాయం జరగకపోతే పార్టీలకు అతీతంగా మహా ఉద్యమం

ప్రజా వాయిస్, నేరడిగొండ / బోథ్ నియోజకవర్గం

ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్ రైల్వే లైన్ రీసర్వే పేరుతో నేరడిగొండ మండలాన్ని విస్మరించి, మార్గాన్ని బజార్‌హత్నూర్ వైపు మళ్లించేందుకు కుట్రలు సాగుతున్నాయని, ఇది ఈ ప్రాంత ప్రజల నోట్లో మట్టి కొట్టడమేనని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్

ధ్వజమెత్తారు. సోమవారం నేరడిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో వాగ్దారి, వెంకటపూర్ సర్పంచ్‌లు విజయ్, వెంకట్ రామ్‌లతో కలిసి అధికారులకు అర్జీ సమర్పించారు. కుప్టి, మహబూబ్ ఘాట్ల నిర్మాణం వ్యయం నెపంతో రైల్వే లైన్‌ను మళ్లించడం హాస్యాస్పదమన్నారు. విశ్వప్రసిద్ధ కుంటాల, పొచ్చెర జలపాతాలు ఉన్న నేరడిగొండకు రైల్వే కనెక్టివిటీ ఇస్తే పర్యాటక శోభతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ మారురూపు సంతరించుకుంటుందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడో కొండలు, లోయలు తొలిచి రైల్వే మార్గాలు వేస్తున్నప్పుడు ఇక్కడ సాకులు చెప్పడం చెల్లదని హెచ్చరించారు. రైల్వే శాఖ తక్షణమే స్పందించి రీసర్వే నివేదికను బహిరంగపరచాలని, నేరడిగొండకు రైల్వే జంక్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సర్వపక్షాలను, ప్రజలను ఏకం చేసి ఊపిరి ఉన్నంతవరకు పోరాడతామని పిలుపునిచ్చారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు మాజీ మంత్రి పరామర్శ

విలేకరి మల్లెపల్లి సాయికిరణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బోడ జనార్దన్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

ప్రజా వాయిస్ బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రజా వాయిస్ విలేకరి మల్లెపల్లి సాయికిరణ్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆదివారం మాజీ మంత్రి బోడ జనార్దన్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. జర్నలిస్టులకు అవసరమైన సహకారం అందించేందుకు తమ వంతు అండగా ఉంటామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో పటేల్ సుధాకర్, బెల్లంపల్లి రూరల్ విలేకరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీం ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం..

86వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో, భీం చౌరస్తాలో భీం విగ్రహానికి పూలమాలలేసి నివాళులు

జల్, జంగల్, జమీన్ నినాదంతో సాగించిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడిన నాయకులు

మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతల సమక్షంలో నివాళులు

ప్రజా వాయిస్,/ ఆదిలాబాద్ జిల్లా

ఆదివాసీల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం నిజాం నవాబుల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గోండు వీరుడు కొమురం భీం 86వ వర్ధంతి వేడుకలను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డీసీసీ

కార్యాలయంలో భీం చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురం భీం చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో కొమురం భీం సాగించిన పోరాటం నేటికీ ఆదివాసీ హక్కుల పోరాటాలకు సజీవ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖిజర్ పాషా, సీనియర్ నేతలు దుర్గం శేఖర్, గౌలి సంజీవ్, సేద్మకి ఆనంద్ రావు, జితేందర్, రూపేశ్ రెడ్డి, దేవిదాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

చింతల సాంగ్వీలో అట్టహాసంగా కొమురం భీం వర్ధంతి.. అమరవీరునికి జోహార్లు

బజార్‌హత్నూర్ మండలం చింతల సాంగ్వీలో ఘనంగా భీం వర్ధంతి వేడుకలు

చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన గిరిజన శ్రేణులు

జల్, జంగల్, జమీన్' పోరాట ఆశయాలను స్మరించుకున్న నాయకులు

ప్రజా వాయిస్, బజార్‌హత్నూర్ / బోథ్ నియోజకవర్గం

బజార్‌హత్నూర్ మండలం చింతల సాంగ్వీ గ్రామంలో విప్లవ వీరుడు, అడవి బిడ్డల ఆరాధ్య దైవం కొమురం భీం 86వ వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన భీం చిత్రపటానికి గిరిజన సంఘాల నాయకులు, గ్రామస్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుని త్యాగాలను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు. కొమురం భీం చూపిన పోరాట బాటలోనే నేటి యువత నడవాలని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, యూత్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత జిల్లాల్లో విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

అత్యవసర మరమ్మతులకు సామగ్రి సిద్ధం

కంట్రోల్ రూమ్‌లు, క్షేత్రస్థాయి సమన్వయం

టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలుల ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సంబంధిత సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్,వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాలతో పాటు కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలపై తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తుగా సిబ్బందిని అప్రమత్తం చేసి, అత్యవసర మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొరగడం చేత ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టేందుకు వాహనాలు, ఏజెన్సీలు విద్యుత్ పరికరాలను సిద్ధంగా

ఉంచుకోవాలని ఆదేశించారు. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రజలకు సాధ్యమైనంతవరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయాలు, సరఫరాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదని వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న జిల్లాల్లో అన్ని సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు.

అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం

అన్ని సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్లలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి, అత్యవసర మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌లు, క్షేత్రస్థాయి సమన్వయం

సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచి, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది షిఫ్టులవారీగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయాలు, మరమ్మతులు, సరఫరా పునరుద్ధరణకు సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.

విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం

తెగిపడిన విద్యుత్ తీగలు, నీట మునిగిన విద్యుత్ పరికరాల వద్ద ప్రజలు వెళ్లకుండా అవసరమైన హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, సంబంధిత లైన్‌ను సురక్షితంగా వేరు చేసినట్లు నిర్ధారించుకున్న తర్వాతే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా స్పందిస్తూ, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సీఎండీ ఆదేశించారు.

వాల్మీకి ఆదర్శాలు పోలీసులకు స్ఫూర్తి

ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా జయంతి వేడుకలు

నిజాయితీ,నిష్పక్షపాతం, మానవీయతతో విధులు నిర్వహించాలి

ప్రజావాయిస్//రాజేంద్రనగర్:

మహర్షి వాల్మీకి జీవితం వ్యక్తిత్వ పరివర్తనకు,ధర్మబద్ధమైన జీవనానికి,మానవీయ విలువలకు గొప్ప స్ఫూర్తిదాయకమని అధికారులు పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని సోమవారం గండిపేట్ మండలం బండ్లగూడ జాగిర్ వద్ద ఉన్న ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రామాయణం ధర్మం, కర్తవ్యనిష్ఠ,త్యాగం, సేవాభావం వంటి విలువలను తరతరాలకు అందిస్తోందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిజాయితీ, నిష్పక్షపాతం,క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, బాధితుల పట్ల మానవీయంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపి పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె.ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు యార్లగడ్డ రాంబాబు, నరహరి,డీఎస్పీలు పీజీ రెడ్డి,ఆదూరి శ్రీనివాసరావు, ఎన్.రామారావు,తిరుపతి శ్రీరాములు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ నహీర్, శంకర్,వినోద్,జి.శ్రీనివాస్, శ్రీరాజు,ఫణి,మహేష్, రిజర్వ్ సబ్ఇన్‌స్పెక్టర్లు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

వాల్మీకి చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి మార్గంలో ముందుకు నడవాలి..

రామాయణ కావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

రామాయణం మహా కావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామాయణ కావ్య కర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి , అదనపు కలెక్టర్ ఎన్. రవి, తదితరులు పూలమాలవేశారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. మహర్షి వాల్మీకి కేవలం ఒక కవి మాత్రమే కాదు అని మన సంస్కృతి, ధర్మానికి మూలాలకు వెలుగునిచ్చిన మార్గదర్శి అని తెలిపారు. మహర్షి వాల్మీకి చూపిన ధర్మ మార్గంలో నడవడం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎస్. లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు!

- బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి

- అధికారులకు ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలు

ప్రజావాయిస్/వికారాబాద్:

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పారదర్శకంగా విచారణ జరపాలి

ప్రజలు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదికగా ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

నాగసానిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, షూస్ పంపిణీ

శ్రీరంగాపూర్ అక్టోబర్ 26 ప్రజా వాయిస్

మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో విద్యార్థులకు ఉచిత దుస్తులు, షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం నరేష్, శ్రీను, కల్పన గ్రామపంచాయతీ సెక్రెటరీ రాజు, విరాట్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం

ఉచిత ఆన్ లైన్ సేవలను వినియోగించుకోవాలి

అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఆర్ఎస్పీ ఫౌండేషన్ రాష్ట్ర డైరెక్టర్ కారంగి బ్రహ్మయ్య

ఎస్సై నరేష్ కుమార్

బిఆర్ఎస్ మండల నాయకులు జొల్లు నారాయణ

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం వీపనగండ్ల మండలం సంగినేనిపల్లి గ్రామంలో పట్టభద్రుల ఓటు నమోదు పై అవగాహన సదస్సును నిర్వహించి, నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీపనగండ్ల మండల ఎస్సై జె.నరేష్ కుమార్, ఆర్ఎస్పీ ఫౌండేషన్ రాష్ట్ర డైరెక్టర్ కారంగి బ్రహ్మయ్య, గ్రామ సర్పంచ్ జయంతి వేణుమాధవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత ఆన్‌లైన్ నమోదు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారు. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, ఫౌండేషన్ బోర్డు సభ్యులు తొల్ల రామకృష్ణ, ఎల్లపోగు విష్ణు, వీపనగండ్ల బిఆర్ఎస్ మండల నాయకులు జోళ్ల నారాయణ, విజయ భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టైలర్ రాముడు, మీసాల మోహన్, జగన్మోహన్ రెడ్డి, ఉడుత రవి, సురేష్ రెడ్డి, కురుమయ్య, రాజు, అశోక్, శేఖర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- బాలబాలికల రక్షణకు చట్టాలపై అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా సురక్షిత్ బచపాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దుర్గం గణేశ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 26 నుంచి 31వ తేదీ వరకు విద్యార్థినీ విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని, ఈ చట్టం ద్వారా బాలల హక్కులు, రక్షణకు సంబంధించిన అంశాలు అమలవుతాయని వివరించారు. బాలికలు సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వారి వలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జడ్జి సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులను లేదా మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొద్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బోయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దివాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

17 ఎకరాల భూదాన్ భూములపై అంతులేని విచారణ!

రాష్ట్రస్థాయి ఆదేశాలున్నా కదలని రెవెన్యూ యంత్రాంగం?

నల్లెల్ల భూముల ఆచూకీ ఏది? మట్టి తవ్వకాల వెనుక అసలు కథేంటి?

రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని భూములను కాపాడాలి

ప్రజా వాయిస్ కురవి:

భూదాన్ ట్రస్ట్‌కు దానం చేసినట్లు పేర్కొంటున్న 17 ఎకరాల భూముల వ్యవహారం నల్లెల్లలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రస్థాయి అధికారులకు సమాచారం అందించినా, భూదాన్ ట్రస్ట్ కార్యదర్శి వివరాలు సమర్పించినా ఈ భూముల ప్రస్తుత స్థితిగతులపై స్పష్టత రావాల్సి ఉండటం రెవెన్యూ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. భూముల హద్దులు ఎక్కడ? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? రికార్డుల్లో ఏమైనా మార్పులు జరిగాయా? మట్టి తవ్వకాలు జరిగితే వాటికి అనుమతులు ఉన్నాయా? అనే కీలక ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని భూదాన్ భూములపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. సంబంధిత రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి నిజానిజాలు తేల్చాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇంతటి ప్రాధాన్యమున్న భూముల వ్యవహారంలో స్పష్టత రావడంలో జాప్యం ఎందుకు జరుగుతోందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

17 ఎకరాలు.. రెండు సర్వే నంబర్లు!

భూదాన్ ట్రస్ట్‌కు దానం చేసినట్లు పేర్కొంటున్న భూముల వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబర్ 350 - 16 ఎకరాలు, సర్వే నంబర్ 363 - 1 ఎకరం, మొత్తం విస్తీర్ణం - 17 ఎకరాలు శ్రీ వెరమా జగన్నాథ్ రెడ్డి, శ్రీ వెరమా రాఘవరెడ్డి ఈ భూములను భూదాన్ ట్రస్ట్‌కు దానం చేసినట్లు రాష్ట్ర భూదాన్ ట్రస్ట్ కార్యదర్శి వెంకటేష్ వివరాలు అందించినట్లు సమాచారం. ఈ భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, ప్రస్తుత స్వాధీన స్థితిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

కమిషనర్, కలెక్టర్‌కు మెమో.. అయినా తేలని అంశాలెన్నో!

ఈ వ్యవహారంపై రాష్ట్ర భూదాన్ ట్రస్ట్ కార్యదర్శి 2026 అక్టోబర్ 9న భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు మెమో సమర్పించినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి అధికారులకు వివరాలు చేరిన నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో విచారణ ఎంతవరకు జరిగింది? ఇప్పటివరకు ఏయే రికార్డులను పరిశీలించారు? భూముల హద్దులు, స్వాధీన స్థితిని నిర్ధారించారా? విచారణలో గుర్తించిన అంశాలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అధికారులకు సమాచారం అందడం ఒక ఎత్తయితే, ఆ సమాచారంపై చర్యలు తీసుకుని వాస్తవాలను నిర్ధారించడం మరో ఎత్తు. భూదాన్ భూముల విషయంలో రెండో దశలోనే స్పష్టత రాకపోతే, భూముల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మట్టి తవ్వకాల ఆరోపణలు.. అనుమతులు ఉన్నాయా?

నల్లెల్ల భూదాన్ భూములకు సంబంధించి మట్టి తవ్వకాల ఆరోపణలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అసలు ఆ భూముల్లో మట్టి తవ్వకాలు ఎక్కడ జరిగాయి? ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారు? సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగితే ప్రభుత్వానికి లేదా ప్రజాధనానికి ఎంత మేర నష్టం వాటిల్లింది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి. అనుమతులు, రవాణా వివరాలు, సంబంధిత రికార్డులు పరిశీలించకుండా ఆరోపణలను కొట్టిపారేయడం ఎంతవరకు సమంజసం? అదే సమయంలో ఆధారాలు లేకుండా ఎవరినీ బాధ్యులుగా నిర్ధారించడం కూడా సరికాదు. క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత శాఖల నివేదికలు, అధికారిక పత్రాల ఆధారంగానే నిజానిజాలను తేల్చాలి.

రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలు.. విచారణలో తేలాల్సిందే!

స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విచారణ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, వాటి వాస్తవికతను కూడా ఉన్నతస్థాయి విచారణలో నిర్ధారించాలి. అధికారులు చట్టానికి లోబడి పనిచేస్తున్నారా? విచారణలో ఎక్కడైనా జాప్యం జరిగిందా? జరిగితే అందుకు కారణాలేమిటి? అనే అంశాలను స్పష్టంగా పరిశీలించాలి. ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజకీయాలకు, వ్యక్తిగత ప్రభావాలకు తావుండకూడదు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే ఆ విషయాన్ని కూడా అధికారికంగా వెల్లడించాలి. అనుమానాలకు తావులేకుండా విచారణ ఫలితాలను ప్రజలకు తెలియజేయడమే పారదర్శక పాలనకు నిదర్శనం.

జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలి!

నల్లెల్లలోని 17 ఎకరాల భూదాన్ భూముల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని ప్రజాప్రయోజనాల దృష్ట్యా డిమాండ్ వినిపిస్తోంది. ఉన్నతస్థాయి విచారణ: అవసరమైతే స్వతంత్ర ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించాలి. క్షేత్రస్థాయి సర్వే: సర్వే నంబర్లు 350, 363లోని మొత్తం 17 ఎకరాల విస్తీర్ణం, హద్దులు, ప్రస్తుత స్వాధీన స్థితిని నిర్ధారించాలి. రికార్డుల పరిశీలన: భూదాన్ ట్రస్ట్ రికార్డులు, పాత రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, భూముల బదిలీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. మట్టి తవ్వకాలపై విచారణ: తవ్వకాలు జరిగినట్లు తేలితే అనుమతులు, పరిమాణం, రవాణా, సంబంధిత నిబంధనల అమలుపై విచారణ జరపాలి. చట్టపరమైన చర్యలు: అక్రమ ఆక్రమణలు, రికార్డుల ఉల్లంఘనలు లేదా అనధికార తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. భూముల పరిరక్షణ: భూముల చట్టబద్ధ స్థితిని నిర్ధారించి, వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం వాటిని పరిరక్షించాలి. విచారణ నివేదిక: విచారణ పూర్తయిన అనంతరం వెల్లడించదగిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

భూముల ఆచూకీ తేల్చడం అధికారుల బాధ్యత!

భూదాన్ ట్రస్ట్‌కు దానం చేసినట్లు పేర్కొంటున్న 17 ఎకరాల భూముల వ్యవహారాన్ని సాధారణ అంశంగా తీసుకోరాదు. భూముల అసలు స్థితి, వాటి హక్కులు, ప్రస్తుత స్వాధీనం, రికార్డుల్లో జరిగిన మార్పులు, మట్టి తవ్వకాల ఆరోపణలు అన్నింటినీ ఒకే సమగ్ర విచారణ పరిధిలోకి తీసుకురావాలి. రాష్ట్రస్థాయి అధికారులకు మెమో సమర్పించినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో, తదుపరి చర్యలపై జిల్లా యంత్రాంగం స్పష్టత ఇవ్వాలి. విచారణ జరిగితే దాని పురోగతిని వెల్లడించాలి. జాప్యం జరిగితే కారణాలను తెలియజేయాలి. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. 17 ఎకరాల భూదాన్ భూములపై మౌనం వీడాలి. రికార్డులు బయటపెట్టాలి. మట్టి తవ్వకాల ఆరోపణలపై నిజాలు తేల్చాలి. భూముల హద్దులు గుర్తించి చట్టప్రకారం పరిరక్షించాలి. నల్లెల్ల భూదాన్ భూముల వ్యవహారంలో జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి...

ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి..

- ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ
- ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాలు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టపరమైన పరిష్కారం అందించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన జిల్లా ఎస్పీ, వారి సమస్యలను ఓపికగా విని ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, చట్టపరమైన పరిష్కారం మరియు సత్వర న్యాయం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందని ఎస్పీ తెలిపారు.

గత పాలకులు నిర్లక్ష్యం రైతుకు శాపమైంది

రాంటేక్ లో రెవిన్యూ గ్రామ సభలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి
అప్పట్లో రెవెన్యూ అధికారుల తప్పిదాలు నియోజకవర్గం లో వేలాది మంది రైతులకు శాపమైందని, వారి నిర్లక్ష్యం మూలంగా రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముధోల్ మండలంలోని . రామ్ టెక్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పంజాబ్ కంపెనీకి ఒక గ్రామంలో రైతు రెండు ఎకరాలు అమ్మితే ఆ సర్వే నంబర్ లో ఉన్న భూములు అన్ని రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో చేర్చి రైతుకు తీరని అన్యాయం చేశారన్నారు. తానూరు, ముధోల్ మండలాల్లో వందలాది మంది రైతులు 15 సంవత్సరాలుగా వారికి స్వంతగా భూమి ఉన్నప్పటికీ రైతుబంధు, రైతు బీమా , బ్యాంకు రుణం, ఇతర పథకాలకు నోచుకోలేక వ్యవసాయం చేసే రైతు కంటతడి పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అప్పట్లో బి ఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇక్కడి పాలకులు పట్టించుకోకపోవడంతో భూమిని నమ్ముకున్న రైతుకు అన్యాయం జరిగిందన్నారు. రాంటేక్ గ్రామంలో రైతులు పంజాబ్ కంపెనీకి 37 ఎకరాల 20 గుంటల భూమి అమ్మితే 295 ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. అదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలో 35 ఎకరాల భూమి అమ్మితే 152 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి 152 మంది రైతులకు ఇబ్బంది పెట్టడం జరిగిందన్నారు. ఈ లెక్కన రైతుబంధు రైతులకు అందక రెండు గ్రామాలకు కలిపి రైతులు 3 కోట్ల 60 లక్షల రూపాయలు నష్టపోవడం జరిగిందన్నారు. ఇలా తానూర్ మండలంలో వేలాది ఎకరాల్లో ఇదే పరిస్థితి ఉందని రైతులు 100 కోట్ల వరకు నష్టపోవడం జరిగిందని, అప్పటి పాలకులు, కొందరు దుష్టశక్తుల మూలంగా ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఇకనైనా మేమున్నామంటూ మాయమాటలు చెప్పే వారిని దగ్గరకు రానీయ వద్దన్నారు. తాను రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో మాట్లాడడంతో ప్రభుత్వం బాధిత గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సభల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. రైతుకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని, నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగిస్తామన్నారు. అంతకుముందు రామ్ టెక్ సర్పంచ్ గంగాధర్, సీనియర్ నాయకులు నర్సా గౌడ్ తో పాటు పలువురు మాట్లాడుతూ సమస్యను తాము ఎమ్మెల్యే పటేల్ దృష్టికి తీసుకుపోవడంతో, ప్రత్యేక దృష్టి సారించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. గ్రామ సభల్లో ఆయా గ్రామాల సర్పంచ్ తో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా నుండి నాలుగు

జాతీయ ఇన్స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన

- అంతర్జాతీయ స్థాయి జపాన్ కి రెండు ప్రదర్శనలు ఎంపిక
- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్
- విద్యార్థులను అభినందించిన కలెక్టర్

ప్రజా వాయిస్,సంగారెడ్డి :
12వ ఇన్స్పైర్ మనకు అవార్డ్స్2023-24 మరియు 2024-25 నకు సంబంధించిన జాతీయస్థాయి పోటీలు ఈ నేల 12 నుండి 14 వరకు న్యూఢిల్లీ లోని భారత్ మండపం ప్రాంగణము నందు జరిగాయి. తెలంగాణ రాష్ట్రము నుండి 52 ప్రాజెక్టులు వివిధ జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. టాప్ 60 కి తెలంగాణ రాష్ట్రం నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగ,సంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు జాతీయ స్థాయిలో పాల్గొనగా ఇద్దరు విద్యార్థులకు టాప్ 60 కి,అంతర్జాతీయ స్థాయికి ఎంపీ కావడం జరిగింది. వీరు త్వరలో జరిగే రాష్ట్రపతి భవన్ లో వీరి ప్రదర్శనలు పాల్గొంటూ రాష్ట్రపతితో విందు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వీరికి లభించింది. వీరు హై స్కూల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం అంతర్జాతీయ స్థాయిలో జరిగే జపాన్ కి కూడ వీరిని ఎంపిక చేయడం జరుగుతుంది. ఇందులో సంగారెడ్డి జిల్లా నుండి చౌడపురం సాయి మేఘన , ఆరిజిన్ టెక్నో స్కూల్, పటాన్చెరు, మిరియాల స్ప్రే మరియు కంటి చూపును తాత్కాలికంగా అడ్డుకునే ఎల్ ఈ డి లైట్లతో కూడిన అల్లర్ల నిరోధక కవచం సంబంధించిన ప్రయోగం.(అంతర్జాతీయ స్థాయికి ఎంపిక), పూర్ణిత్ రెడ్డి ,భారతీయ విద్యాభవన్ బిహెచ్ఎల్, కృతిమ మేధస్సు సహాయంతో దృష్టిలోపం ఉన్నవారికి సహాయం చేయడం(అంతర్జాతీయ స్థాయికి ఎంపిక) రుద్ర శరణ్య, పాయనీర్ స్కూల్ సంగారెడ్డి, గృహ అవసరాల కోసం బహుళ ప్రయోజనాల వస్తు రవాణా సాధనం. ఆయుష్ కుమార్ ఉపాధ్యాయ, సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, వడక్ పల్లి,అమీన్పూర్ , టాక్ గురు సమాచార మార్పిడి లోని అడ్డంకులను అధిగమించడం దృష్టిలోపం ఉన్నవారికి సహాయం చేసే పరికరం చేయడం జరిగింది. కలెక్టర్ ప్రతిక్ జైన్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా మన సంగారెడ్డి జిల్లాకు మంచి పేరును తీసుకొని రావాలి అదేవిధంగా సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయపరమైన నూతన ఆవిష్కరణలు చేసి దేశానికి ఉపయోగపడే మంచి శాస్త్రవేత్తలుగా స్థిరపడాలని అన్నారు .అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన సాయి మేఘన, పూర్ణిత్ రెడ్డి, ఆయుష్ , రుద్ర శరణ్య విద్యార్థులకు,వారి యాజమాన్యానికి, గైడ్ టీచర్లకు, తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, జిల్లా విద్యాశాఖ అధికారిని రోహిణి ప్రశంసా పత్రం, శాలువా ,జ్ఞాపకతో అభినందించడం జరిగింది.

ఆపదలో అండగా స్వామి వివేకానంద పొదుపు సంఘం

ఇటీవల మృతి చెందిన లంబడి శ్రీనివాస్ కుటుంబానికి ఇన్సూరెన్స్ రూపంగా 1,02,000 ఆర్థిక సాయం

(ప్రజా వాయిస్ షాబాద్)
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని స్వామి వివేకానంద పొదుపు సంఘం సభ్యుడైన లంబడి శ్రీనివాస్ ఇటీవలే అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందారు. ఆయన మృతితో తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయిన బాధితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు స్వామి వివేకానంద పొదుపు సంఘం పాలకవర్గం ఉదారంగా ముందుకు వచ్చిందిసంఘం ఇన్సూరెన్స్ నియమ నిబంధనల ప్రకారం వర్తించే లక్షా రెండు వేల రూపాయల పరిహార చెక్కు ఆర్థిక సాయాన్ని స్వామి వివేకానంద పొదుపు సంఘం అధ్యక్షులు ధర్పల్లి రవీందర్, కార్యదర్శి గంధం గౌరీ మరియు పాలకవర్గ సభ్యులు స్వయంగా మృతుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో వారి కుటుంబానికి పొదుపు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివేకానంద పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు

భూ రీ సర్వేతో హద్దుల వివాదాలకు చెక్!

రైతులు సహకరించాలి: డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్

ప్రజావాయిస్ /మోమిన్ పేట్:
భూ సరిహద్దుల వివాదాల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల్లో పారదర్శకత కోసం చేపడుతున్న భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్ కోరారు. సోమవారం మోమిన్ పేట్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించుకుని, సర్వే సమయంలో అధికారులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. భూ రీ సర్వేపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్, ఆర్ఐ సరిత, జీపీఓలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సర్వేయర్ రాందాస్, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ 390లో మట్టి తవ్వకాలపై కలెక్టర్ ని విచారణ కోరిన సర్పంచ్

లీజు పరిమితులు, తవ్వకాలు, రవాణా అనుమతులపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజా వాయిస్ పెద్దపల్లి
మండలం తుర్కలమద్దికుంట గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య, గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 390లో జరుగుతున్న మట్టి తవ్వకాలు, మట్టి రవాణా అనుమతులు, మంజూరైన లీజు పరిమితులపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. తవ్వకాలకు, మట్టి రవాణాకు జారీ చేసిన అనుమతులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? మంజూరైన లీజు పరిధిలోనే తవ్వకాలు జరుగుతున్నాయా? అనే అంశాలను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్, అర్జీని ఏడీ మైన్స్ అధికారికి పంపించి, సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గోదావరి తల్లి కన్నీటి గోస 2.0

- మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కి.మీ. మహా సైకిల్ యాత్ర
- కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి రైతుల పంటలను కాపాడాలి - బొడ్డు రవీందర్

ప్రజా వాయిస్ గోదావరిఖని
కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ రామగుండం నాయకుడు బొడ్డు రవీందర్ తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన యాత్ర వివరాలను వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి రైతులకు అందించకుండా దిగువకు వదిలేస్తున్నారని రవీందర్ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందకపోతే రైతుల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకొని రైతులకు సాగునీరు అందించాలని, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ వైఖరికి నిరసనగా 'గోదావరి తల్లి కన్నీటి గోస--2.0' పేరుతో ఈ మహా సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల కొమరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాసంగిలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి..

- ఎల్ నినో వల్ల కలిగే నష్టాలుపై వివరించాలి
- దుబ్బాక ఏడిఏ మల్లయ్య

ప్రజా వాయిస్/దుబ్బాక:
యాసంగిలో రైతులు వరికి బదులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న పొద్దు తిరుగుడు, వేరుశనగ, పెసర, మినుము, కూరగాయలు తదితర పంటలు సాగు చేయాలని దుబ్బాక డివిజన్ ఏడిఏ కాంపాటి మల్లయ్య అన్నారు. సోమవారం దుబ్బాక మండల ఏఈఓలు, డిజిటల్ క్రాప్ సర్వేర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఏఈఓ రైతులకు ఎల్ నినో వల్ల కలిగే అనర్థాలను వివరించి వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రతి గ్రామంలో సమావేశం నిర్వహించాలన్నారు అదేవిధంగా డిజిటల్ క్రాప్ సర్వేను త్వరితంగా పూర్తి చేయాలని కోరారు. రోజు రోజుకీ భూగర్భ జలాలు తగ్గ ముఖం పడుతున్నాయి, కావున రైతులు తక్కువ నీటిని వినియోగించే పంటలు పండించాలని కోరారు, ప్రతి ఏఈఓ రైతు వేదిక లో రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు ఇవ్వాలని, లేని ఎడల శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో ఏఈఓలు సంతోష్, హరీష్, మనోజ్ఞ అనూష, సమజాత సంధ్య , రేణుక, అరుంధతి, డిజిటల్ క్రాఫ్ సర్వేర్లు పాల్గొన్నారు.

మంథని మున్సిపల్ పాలకవర్గానికి ఇనుముల సతీష్ సన్మానం

పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం,సుందరీకరణకు కృషి చేయాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్ మంథని

మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లను న్యాయవాది, మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ (సత్యనారాయణ) శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల బతుకమ్మ, దసరా వేడుకలను విజయవంతంగా నిర్వహించిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ యెల్లంకి వంశీ, 10వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజును సైతం సత్కరించారు. రానున్న రోజుల్లో మంథని పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, పరిశుభ్రత, పచ్చదనం, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలని ఇనుముల సతీష్ కోరారు. ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ డైరెక్టర్ వేల్పుల సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ పోరాటం అభినందనీయం

మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు

ప్రజా వాయిస్,కోదాడ:

అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేస్తున్న ఉద్యమాలు అభినందనీయమని కోదాడ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు అన్నారు. ఈ మేరకు మంద కృష్ణ మాదిగను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావెళ్ల కృష్ణారావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు సామాజిక సమానత్వం కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న పోరాటాలు అణగారిన వర్గాల్లో చైతన్యం నింపుతున్నాయని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు లభించినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. సామాజిక వివక్ష, అసమానతలను తొలగించి ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు నిరంతర కృషి అవసరమని తెలిపారు. అట్టడుగు వర్గాల సమస్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లడంలో మంద కృష్ణ మాదిగ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు.

అందోల్- పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' లీగల్ అవగాహన సదస్సు

- చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి
- జోగిపేట మున్సిఫ్ కోర్ట్ మెజిస్ట్రేట్ అసదుల షరీఫ్

ప్రజావాయిస్సంగారెడ్డి(జోగిపేట)

పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాల నుంచి వారిని రక్షించేందుకు దేశవ్యాప్తంగా పాఠశాలల్లో చేపట్టిన "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" (చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం – POCSO Act, 2012) కార్యక్రమంలో భాగంగా అందోల్ మండల పరిధిలోని (జడ్పీహెచ్‌ఎస్) పాఠశాలలో ప్రత్యేక లీగల్ అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహమ్మద్ అసదుల్లా షరీఫ్ , చైర్మన్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ – జూనియర్ సివిల్ జడ్జి హాజరై మాట్లాడుతూ... పోక్సో (గూజూూ) చట్టం – 2012 ప్రకారం పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు తీవ్రమైన శిక్షార్హమైన నేరాలని, బాధితులకు ఈ చట్టం ద్వారా పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే అడ్వకేట్ వర్మ ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జోగిపేట ఏఎస్ఐ (గూూ×) పాల్గొని, బాలల భద్రత, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ దేవీదాస్ మాట్లాడుతూ... విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు, వారి మానసిక స్థైర్యానికి ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని, పాఠశాలలో విద్యార్థుల రక్షణకు తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు జిల్లా ఇంచార్జీ

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ములుగు జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు జిల్లా ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి సూచించారు.

ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నివాసంలో పార్టీ ముఖ్యనేతలతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై ఆయన విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ఓటరు నమోదు పురోగతి, అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

ఓటరు నమోదు ప్రక్రియలో వేగం పెంచాలి:

ఈ సందర్భంగా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

మాట్లాడుతూ..... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కీలకమైన అంశమని, అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా పట్టభద్రులను గుర్తించి, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నమోదు చేసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించాలని అన్నారు.

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

ములుగు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి నమోదు ప్రక్రియపై వివరించడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, నమోదు సమయంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలుపే లక్ష్యం

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యాచరణ రూపొందించుకోవాలని సమావేశంలో సూచించారు. ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయిలో సమన్వయం పెంచుకుని, పట్టభద్రుల సమస్యలు, వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రజలకు చేరువ కావాలని చర్చించారు.

జిల్లా స్థాయిలో కార్యాచరణకు ప్రాధాన్యత

జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నివాసంలో జరిగిన ఈ సమావేశం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసే అంశంపై కేంద్రీకృతమైంది. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించడం, నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జంగాలపల్లి, బరిగాలనిపల్లి సర్పంచ్లు ముడతనపల్లి మోహన్, వీరబోయిన రాజేందర్, మాజీ ఎంపీపీ మస్రగాని వినయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ బేతెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు ఎర్ల వెంకన్న, గడ్డమీది భాస్కర్, చాంద్ పాషా, అలిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన..

అల్టి ట్యూడ్ పాఠశాలలో షేర్ ఎన్ జి ఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షేర్ ఎన్ జి ఓ ప్రతినిధి జగన్ సూచించారు. ఎల్కతుర్తి మండలంలోని ఆల్టి ట్యూడ్ పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాల నివారణ పోలీసుల సహాయం హెల్ప్ లైన్ నంబర్లు ఆన్లైన్ భద్రత సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, వివాహాలు బాలికల విద్య ఆరోగ్యం భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్న అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపద సమయంలో పోలీసులను ఎలా సంప్రదించాలి, హెల్ప్ లైన్ నంబర్లను ఎలా వినియోగించుకోవాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రస్తుత డిజిటల్ యుగములో పెరుగుతున్న ఆన్లైన్ మోసాలు సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని అనుమానస్పద లింకులను తెరవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా

వినియోగించాలని వివరించారు. సైబర్ నేరాలకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు తెలియజేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక సమస్యలు చట్టాలు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. విద్యార్థులు ప్రతి విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదవాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు పాఠశాలకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి స్నేహాలను అలవర్చుకోవాలని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి పనుల కోసం ఉపయోగించుకోవాలని సోషల్ మీడియా లేదా ఆన్లైన్ పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే దాచిపెట్టకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో పంచుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించేందుకు పాఠశాల ఎల్లప్పుడు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సురేష్, ఆశ, బేగం సుమలత, మమత, లలిత, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు బాల్య వివాహాల నివారణ హెల్ప్ లైన్ సేవలు పోలీసుల సహాయం సైబర్ భద్రత వ్యక్తిగత బాధ్యతలపై అవగాహన కల్పించారు.

పెండింగ్ ఎస్ఐఆర్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- పారదర్శకంగా, తప్పులకు తావులేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజా వాయిస్,సంగారెడ్డి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అర్హత కలిగిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఫారం–6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ పనులపై

సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫారం–6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హతలను నిర్ధారించాలన్నారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అనర్హతకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, అందుకు సంబంధించిన ఆధారాలు, పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పునఃపరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు.

బాలల భద్రతపై సురక్షిత్ బచ్పన్ అభియాన్ అవగాహన సదస్సులు ప్రారంభం

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

పోక్సో చట్టం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై చైతన్యం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు కె. మురళీ మోహన్

ప్రజా వాయిస్ ,మహబూబాబాద్

జిల్లాలో బాలల హక్కులు, భద్రతపై అవగాహన కల్పించేందుకు మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' తొలిదశ అఖిల భారత పాఠశాల అవగాహన ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం స్థానిక శ్రీ పాణిని హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు కె. మురళీ మోహన్, సంస్థ కార్యదర్శి స్వాతి మురారి దిశానిర్దేశంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తొలిరోజు సదస్సులో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి బిడ్డకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన

వాతావరణాన్ని కల్పించడంతోపాటు, వారి ప్రాథమిక హక్కులు, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంపొందించడమే ఈ ప్రచార కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బాలల రక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినప్పుడు, అభద్రతకు గురైనప్పుడు ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం న్యాయవాదులు చెన్న మల్లారెడ్డి, రాజ్‌కృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను వివరించారు. అవసరమైన వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్మిడి భూ వివాదంపై స్పందించిన పాలకుర్తి ఎస్సై సృజన్ కుమార్

ఇరు వర్గాలను పిలిచి విచారణ.. శాంతింపజేసిన పోలీసులు

గౌడ సంఘం గీత కార్మికులకు ఇబ్బందులు, నష్టం కలిగించవద్దని సూచన

భూ వివాదానికి కారణమైన వ్యక్తిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజా వాయిస్ / పాలకుర్తి / అక్టోబర్ 26

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో నెలకొన్న భూ వివాదంపై పాలకుర్తి ఎస్సై ఊర సృజన్ కుమార్ స్పందించారు. గ్రామంలో భూ సమస్య కారణంగా ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులను గ్రామ పంచాయతీ కార్యాలయానికి పిలిపించి, వివాదానికి సంబంధించిన అంశాలపై విచారణ

చేపట్టారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఎస్సై, వారికి తగిన సూచనలు చేసి, పరస్పరం గొడవలకు దిగకుండా శాంతియుతంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా, గౌడ సంఘానికి చెందిన గీత కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని, వారి ఉపాధికి ఆటంకం కలిగిస్తూ నష్టం చేయవద్దని మరో వర్గానికి చెందిన హరిజనులకు సూచించినట్లు సమాచారం. భూ వివాదం కారణంగా గీత కార్మికుల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వ్యక్తిగత సమస్యలను కులాల మధ్య వివాదాలుగా మార్చకూడదని పోలీసులు హితవు పలికారు. భూ వివాదానికి కారణమైన వ్యక్తిని విచారణ నిమిత్తం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, సమస్యలను చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించారు. పోలీసుల జోక్యంతో ఇరు వర్గాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతను తగ్గించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

హామీ నిలబెట్టుకోని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

- జిల్లా వ్యాప్తంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిరసనలు

- రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనికి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర కమిటీ మేరకు భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వ్యవసాయానికి ఇస్తానన్న 24 గంటల విద్యుత్ ఇవ్వకపోగా కనీసం 10 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. దీంతో లక్షల పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు కౌలు రైతులు మది దారుణంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఎన్నికల సందర్భంలో ఎరువుల ధరలు పెంచమని హామీ ఇచ్చి గత ఏడాది డిఏపి 1400 ఉంటే ఈ సంవత్సరం 2100 చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అందోల్ మండలం లో భారతీయ కిసాన్ సంఘ్ ధర్నా

వాల్మీకి మహర్షి తపస్సు చేసిన పుణ్యభూమి వల్మిడి..
వల్మిడి మునుల గుట్టపై వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

ఆలయ ఈఓ, అర్చకులు, గ్రామ సర్పంచ్, కార్యదర్శి మరియు గ్రామ ప్రజల హాజరు

ప్రజా వాయిస్ / పాలకుర్తి / అక్టోబర్ 26

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని మునుల గుట్ట వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాల్మీకి మహర్షి ఆధ్యాత్మిక వైభవాన్ని, ఆయన సాహిత్య సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు, గ్రామ సర్పంచ్, కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షితో వల్మిడికి ప్రత్యేక అనుబంధం

వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవిగా ప్రసిద్ధి చెందారు. సంస్కృత సాహిత్యంలో ఆయనకు విశిష్టమైన స్థానం ఉంది. ధర్మం, సత్యం, త్యాగం, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షిగా ఆయనను గౌరవిస్తారు. వాల్మీకి మహర్షి వల్మిడి ప్రాంతంలో నివసించి, ఇక్కడి మునుల గుట్టపై తపస్సు చేసినట్లు స్థానిక పురాణగాథలు, ప్రజల విశ్వాసాలు చెబుతున్నాయి. ఈ కారణంగా వల్మిడి గ్రామానికి వాల్మీకి పురంఅనే పేరుతోనూ గుర్తింపు ఉంది. మునుల గుట్ట, రాముల గుట్టలతో ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది.

రామాయణ రచనతో చిరస్థాయిగా నిలిచిన మహర్షి

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. శ్రీరాముడి జీవిత విశేషాల ద్వారా ధర్మబద్ధమైన జీవనం, కర్తవ్యనిష్ఠ, కుటుంబ విలువలు, న్యాయం వంటి అంశాలను ఈ మహాకావ్యం తెలియజేస్తుంది. అందుకే వాల్మీకి మహర్షిని ఆదికవిగా పిలుస్తూ తరతరాలుగా ఆయన జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చాటిన జయంతి వేడుకలు

వల్మిడి మునుల గుట్ట వద్ద నిర్వహించిన ఈ జయంతి కార్యక్రమం ద్వారా గ్రామానికి ఉన్న పురాణ ప్రాశస్త్యాన్ని, వాల్మీకి మహర్షితో ముడిపడిన స్థానిక విశ్వాసాలను

మరోసారి గుర్తుచేసుకున్నారు. వల్మిడి ప్రాంతంలోని ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని గ్రామస్తులు భావిస్తున్నారు. వాల్మీకి మహర్షి బోధనలు, రామాయణంలోని ధర్మసందేశాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, గ్రామ సర్పంచ్, మాది సర్పంచ్,ఎంపిటిసి, గ్రామ సెక్రెటరీ (కార్యదర్శి) గ్రామ నాయకులు గ్రామ ప్రజలు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకుతో డిజిటల్ భద్రతా పాఠాలు..
ఆకట్టుకున్న విద్యార్థినుల సృజనాత్మకత

ప్రజా వాయిస్, కోరుట్ల:

జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసంలో భాగంగా విద్యార్థినులకు గోరింటాకు డిజైన్ల పోటీలు నిర్వహించి, సాంప్రదాయ కళకు ఆధునిక హంగులు జోడించారు. ఆన్‌లైన్ ఖాతాలను సురక్షితంగా ఉంచుకోవడానికి పటిష్టమైన పాస్‌వర్డ్‌లను ఎలా ఉపయోగించాలో డిజైన్ల

ద్వారా జిల్లా పరిషత్ విద్యార్థినులు చాటిచెప్పారు. అదనపు భద్రత కోసం టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ ప్రాముఖ్యతను తమ గోరింటాకు కళ ద్వారా చక్కగా ప్రదర్శించారు. సైబర్ మోసాల బారిన పడినప్పుడు వెంటనే సహాయం పొందడానికి ఉపయోగపడే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను గోరింటాకు రూపంలో తీర్చిదిద్దారు. కోరుట్ల న్యాయమూర్తి కె. పావని ఈ సృజనాత్మక కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందించి, విద్యార్థి దశ నుంచే ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని హెచ్ఎం వి. గంగాధర్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు 399 కేంద్రాలు!

సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్

గ్రేడ్-ఏకు రూ.2,461..సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధర

ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి

నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం తీసుకురావాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్..

ప్రజా వాయిస్, నల్గొండ

ఈ ఖరీఫ్‌లో ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర అందించేందుకు జిల్లాలో 399 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. సోమవారం నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2026 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో

కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,461, సాధారణ రకానికి రూ. 2,441 మద్దతు ధర ప్రకటించిందన్నారు. సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తోందని తెలిపారు. ధాన్యంలో తాలు, తరుగు, చెత్త, మట్టిపెళ్లలు లేకుండా, తేమ 17 శాతానికి మించకుండా తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 6.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు వెల్లడించారు. సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించాలని ఆదేశించినట్లు తెలిపారు. మార్కెట్‌లో సన్న ధాన్యానికి డిమాండ్ ఎక్కువగా ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగిస్తూ కూరగాయలు, ఉద్యాన, ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమిష్టి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత ఖరీఫ్ మాదిరిగానే ఈసారి కూడా రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, జిల్లా సహకార అధికారి మమత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలకు ఆదిలాబాద్‌లో స్థానం లేదు: పసుల చంట

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన నేతలకు విమర్శించే అర్హత లేదు

ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వంపై నెట్టడం ప్రతిపక్షాల దిగజారుడు రాజకీయమే

రానున్న అసెంబ్లీ, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయం

ప్రజా వాయిస్/బోథ్ నియోజకవర్గం

బోథ్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జిల్లాలో అవకాశవాద రాజకీయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం చేకూర్చి, ఉనికిని ప్రశ్నార్థకం చేసిన వ్యక్తికి కాంగ్రెస్ అగ్రనేతలను విమర్శించే అర్హత లేదన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకులను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. రైతుల గురించి కనీస అవగాహన లేని ప్రతిపక్ష నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌లు చదువుతూ రాజకీయ లబ్ధి కోసం రైతు గర్జనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, మైలి నారాయణ, సుద్దుల అరుణ్ రెడ్డి, చౌహాన్ దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు...

|| పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్....

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడని పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి అని కొనియాడారు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తూ, సమాజానికి నైతిక విలువలను బోధిస్తోందని

అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మనిషి తన జీవితంలో మంచి మార్పును స్వీకరించి ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం, క్రమశిక్షణ, నైతిక విలువలను పాటిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహర్షి వాల్మీకి ఆశయాలను, బోధనలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఏ. ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు,ఎస్బి సీఐ నాగరాజు, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

రామాయణాన్ని రచించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప కవి వాల్మీకి

వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరు నెరవేర్చాలి

శ్రీరంగాపురం అక్టోబర్ 26 ప్రజా వాయిస్

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గ్రామస్తులు, వాల్మీకి సంఘం నాయకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వాల్మీకి జయంతి సందర్భంగా గ్రామంలోని వాల్మీకి మహర్షి విగ్రహాన్ని రంగురంగుల పూలమాలలతో నయనమనోహరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాషాయ కండువాలు ధరించి, జై వాల్మీకి అంటూ నినాదాలు చేస్తూ టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. రామాయణాన్ని రచించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన వాల్మీకి మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, గ్రామ సర్పంచ్ భారతి ఎల్ల గౌడ్, వాల్మీకి సంఘం నాయకులు గ్రామ పెద్దలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాలో ఎంపీ ట్రెక్కింగ్..

పర్యాటక అభివృద్ధికి కృషి- వంశీకృష్ణ

ప్రజా వాయిస్ రామగిరి

చారిత్రాత్మక రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆయన రామగిరి ఖిల్లాను సందర్శించి, యువతతో కలిసి ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పర్యాటక సదుపాయాలు కల్పిస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. ఖిల్లా వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మోటకొండూరు ఎస్సీ బాలుర వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు డిమాండ్

మోటకొండూరు, అక్టోబర్ 26(ప్రజా వాయిస్):-

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు హాస్టల్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తెస్తూ పలు డిమాండ్లు చేశారు. హాస్టల్‌లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నప్పటికీ నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రివేళల్లో పాములు సంచరిస్తూ తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆంజనేయులు తెలిపారు. తక్షణమే ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ మరియు పర్మినెంట్ వంట మనిషి (కుక్) పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కుక్ లేకపోవడంతో హాస్టల్ కార్మికులే వంట చేస్తూ వంద మంది పిల్లలకు వడ్డిస్తున్నారని, వాష్‌రూమ్‌ల శుభ్రతకు స్కావెంజర్‌ను నియమించాలని కోరారు. గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ. 11 వేల తక్కువ వేతనమే ఇస్తున్నారని, ఎలాంటి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ. 30 వేలకు పెంచి అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గత 10 నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఒకే వ్యక్తి నైట్ వాచ్‌మెన్ డ్యూటీ చేస్తూ, వంద మందికి వంట వండుతూ, రూములు శుభ్రం చేయడం వల్ల తీవ్ర పనిభారం పడుతోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సర్వే కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వడ్డేబోయిన మహేందర్, హాస్టల్ కార్మికులు వద్దిగళ్ళ బిక్షపతి, వెంకటయ్య, మామిడికాయల సోమక్క, బొట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాంబే కాలనీలో కలుషిత నీటి సమస్యపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్

పటాన్ చెరువు ప్రజావాయిస్

భారతీనగర్ డివిజన్ పరిధిలోని బాంబే కాలనీలో గత వారం రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయడంతో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి విజ్ఞప్తి మేరకు సోమవారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ కాలనీని సందర్శించారు. ఈ పర్యటనలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి స్థానికులతో ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాంబే కాలనీలో ఇంటింటికీ వెళ్లి నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించిన

అనంతరం, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాత రామచంద్రాపురంలో జరుగుతున్న రెండు నీటి మరమ్మతు పనులతో పాటు, వాసవి నగర్ కాలనీలో యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) సమస్యను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ గారు సంబంధిత అధికారులను ఆదేశించారు. బాంబే కాలనీలో గత వారం రోజులుగా కలుషిత నీరు వస్తోందని స్థానిక నివాసితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, బీడీఎల్ అపార్ట్‌మెంట్ వద్ద డ్రైనేజీ నీరు తాగునీటి పైప్‌లైన్‌లో కలుస్తున్న ప్రదేశాన్ని గుర్తించారు. ఈ తనిఖీల్లో జలమండలి డీజీఎం శివకుమార్, ఏఈ ధనుంజయ్, నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, కలుషిత నీటి సరఫరాకు కారణమైన

లోపాన్ని సరిచేసి, కాలనీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. అలాగే యూజీడీ, నీటి మరమ్మతులకు సంబంధించిన సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన అవసరం

రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ

నందిగామ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం

హాజరైన న్యాయమూర్తి సాహితి నందిగామ ఎస్సై సుశీల

చట్టాలు హక్కులపై విద్యార్థులకు అవగాహన

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు విద్యార్థుల్లో చిన్నతనం నుంచే దేశ చట్టాలు, పౌర హక్కులు మరియు బాధ్యతలపై సమగ్ర అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ విజ్ఞాన

సదస్సుకు న్యాయమూర్తి సాహితి, నందిగామ ఎస్సై సుశీల , మరియు రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చట్టాలు, పౌర బాధ్యతలు, మహిళా రక్షణ, ర్యాగింగ్ నిరోధం మరియు సైబర్ భద్రత వంటి ముఖ్యాంశాలపై తమ అవగాహన కార్యక్రమం నిర్వహించారు విద్యార్థుల ప్రసంగ పటిమను, చట్టాల పట్ల వారికున్న విజ్ఞానాన్ని మరియు ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యతాయుతమైన

పౌరుడిగా ఎదగడానికి చట్ట పరిజ్ఞానం ఎంతో తోడ్పడుతుందని వివరించారు విద్యార్థులకు సైబర్ నేరాలు, బాలల హక్కులు, మరియు పోలీస్ సేవలకు సంబంధించి విలువైన అవగాహన కల్పించారు పాఠశాల స్థాయిలో ఇటువంటి ఉపయోగకరమైన న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రభుత్వ శాఖల అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేటలో గంజాయిపై విరుచుకుపడ్డ యువత..

భారీ ర్యాలీతో హోరెత్తిన మండల కేంద్రం!

ప్రజా వాయిస్ / మంచిర్యాల క్రైమ్

గంజాయి రహిత మండలంగా కాసిపేటను మార్చేందుకు యువత నడుంబిగించింది. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మహమ్మారిని ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ స్పందన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, వివిధ ప్రజా సంఘాల నాయకులు మరియు మండల యువత కలిసి భారీ చైతన్య ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం గుండా సాగిన ఈ భారీ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొని గంజాయికి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం యువజన నాయకులు మండల అధికారులు, విద్యాసంస్థల బాధ్యులను కలిసి గంజాయి నియంత్రణపై వినతిపత్రాలు అందజేశారు. మండల డిప్యూటీ తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి (వీణా) మరియు ముత్యంపెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించి,

గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. మోడల్ స్కూల్ అండ్ కాలేజ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లకు వినతిపత్రాలు అందజేస్తూ, విద్యార్థుల్లో చెడు అలవాట్లు ప్రవేశించకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో విలువలతో కూడిన విద్యను అందిస్తూ ప్రతీ విద్యార్థిని క్రమశిక్షణ కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన పోలీసు అధికారులు మాట్లాడుతూ... గంజాయి వాడకం వల్ల కలిగే తీవ్ర శారీరక, మానసిక దుష్ప్రభావాలను ప్రజలకు, విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. గంజాయి మహమ్మారి బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ చైతన్య కార్యక్రమంలో స్పందన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, మండలంలోని వివిధ యువజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి

నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, పారిశుధ్యానికి ప్రాధాన్యం

ప్రజా వాయిస్,మోతే:

సూర్యాపేట జిల్లా,మోతె మండలం సర్వారం గ్రామంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ మూడ్ నగేష్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాల మెరుగుదల, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుధ్యంపై చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ సూచించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం నూతన ఏఏపీసీ కమిటీని ఏర్పాటు చేశారు. పాఠశాల పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఏఏపీసీ కమిటీ చైర్మన్, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్

సిఎం నివాసానికి వెళ్లకుండా పోలీసులు అడ్డంకి...

నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించిన పోలీసులు

ప్రజా వాయిస్ టేక్మాల్:

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించేందుకు ఆందోళన చేపట్టనున్న నేపథ్యంలో టేక్మాల్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పిలుపు మేరకు ఆందోళనలో పాల్గొనే అవకాశం ఉందన్న సమాచారంతో మండలానికి చెందిన భక్తుల వీరప్ప, నాయికోటి భాస్కర్, కమ్మరి సిద్ధయ్యతో పాటు పలువురిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఉద్యమకారులతో పాటు వివిధ అనుబంధ సంఘాల సభ్యులు కూడా ఆందోళనలో పాల్గొనే అవకాశం ఉండటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టేక్మాల్ పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ముందస్తు అరెస్టుల ప్రక్రియలో ఏఎస్ఐ జగదీశ్వర్‌తో పాటు రాజు, అశోక్, రవి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుజరాత్‌లో అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడి అరెస్ట్: ఎస్పీ అఖిల్ మహాజన్

వాట్సాప్ లింకుల ద్వారా ఖాతాల నుంచి రూ.4.20 లక్షలు ఊడ్చేసిన ఘరానా దొంగ

సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆటకట్టించిన బేల మండల పోలీసులు

బాధితుడికి కోర్టు ద్వారా రూ.2 లక్షలు రికవరీ చేసి అందజేసిన రక్షకభటులు

ప్రజా వాయిస్, బేల/ఆదిలాబాద్ జిల్లా

ఆదిలాబాద్ జిల్లా బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంగిడి గ్రామానికి చెందిన బాధితుడిని వాట్సాప్ లింక్ ద్వారా బురిడీ కొట్టించి, రూ.4.20 లక్షలు కాజేసిన రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడు దినేష్ పటేల్ (23)ను బేల పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కేసు వివరాలను వెల్లడించారు. ?అమ్మాయిల వలపు సేవల పేరుతో నకిలీ లింకులు పంపిస్తూ దేశవ్యాప్తంగా 220 మోసాలకు, తెలంగాణలో 20 నేరాలకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో వెంటనే స్పందించిన పోలీసులు సైబర్ నెట్‌వర్క్ ద్వారా రూ.2 లక్షలను ఫ్రీజ్ చేసి, కోర్టు ద్వారా బాధితుడికి అందజేశారు. నిందితుడి నుంచి 3 మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని లింకులు ఓపెన్ చేయవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ శ్రావణ్ కుమార్, ఎస్ఐ మధుకృష్ణ పాల్గొన్నారు.

మోదీ కుటుంబంపై వ్యాఖ్యలతో బీజేపీ భగ్గు

శంషాబాద్‌లో ఖర్గే దిష్టిబొమ్మ దహనం.. కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

రాజ్ భూపాల్ గౌడ్ నేతృత్వంలో నిరసన

ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరు

ప్రజావాయిస్॥శంషాబాద్:

ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి.ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు శంషాబాద్‌లో ఆందోళనకు దిగారు.జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయాల్లో విమర్శలు విధానాలు,ప్రజా సమస్యల చుట్టూ ఉండాలని,వ్యక్తిగత దూషణలకు తావుండకూడదని పేర్కొన్నారు.ప్రధాని కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు సరికావని విమర్శిస్తూ,కాంగ్రెస్ నాయకులు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రత్నం,నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,తోకల శ్రీనివాస్ రెడ్డి, పాపయ్య గౌడ్,మహేందర్, వై.శ్రీధర్,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,జిల్లా,రాష్ట్ర నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజావాణిలో పిర్యాదు చేసిన చందులాల్

ప్రజలు ఇబ్బందుకు పడుతుంటే అదుకారులకు పట్టదా?

ప్రజా వాయిస్ అచ్చంపేట అక్టోబర్ 25



అచ్చంపేటలోని ఎమ్మార్వో ,ఆర్డీఓ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అడ్వకేట్ చందూలాల్ చౌహాన్ నేడు మండల ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.వివిధ గ్రామాల నుంచి వచ్చే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి కార్యాలయాల్లో వేచి ఉండాల్సి వస్తోందని, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొంటూ, ఎమ్మార్వో మరియు ఆర్డీవో కార్యాలయాల్లో పురుషులు, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించి, తాగునీరు, పరిశుభ్రత వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.

గోదావరి పుష్కరాల సీసీ రోడ్లకు 5 కోట్ల నిధులు మంజూరు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వెల్లడి

ప్రజా వాయిస్, ఇబ్రహీంపట్నం:

2027 గోదావరి పుష్కరాల కోసం తీర ప్రాంత గ్రామాల నుంచి ఘాట్ల వరకు సీసీ రోడ్ల నిర్మాణం నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం ఏర్దండి నుంచి గోదావరి ఘాట్ వరకు రూ.2 కోట్లు, మల్లాపూర్ మండలం వాల్గొండ నుంచి గోదావరి ఘాట్ వరకు రూ.3 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గత నెలలో వచ్చిన నిధులకు ఇవి అదనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగరావు ప్రతిపాదనల మేరకు నీటిపారుదల శాఖ ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియం చేసుకోవాలి

సర్పంచ్ మీసాల పార్వతమ్మ

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్ల మండల కేంద్రం లో మంగళవారం గ్రామపంచాయతీ పాలకమండలి సహకారంతో వనపర్తి శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మీసాల పార్వతమ్మ సోమవారం విలేకరులతో తెలిపారు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని కోరారు. ఉచితంగా కంటి స్కానింగ్ చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది అని సర్పంచ్ మీసాల పార్వతమ్మ తెలిపారు.

వీపనగండ్లలో జరిగిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు

ఎంపీడీవో నరసింహులు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి మొత్తం మూడు దరఖాస్తులు స్వీకరించారు.శాఖల వారీగా పరిశీలిస్తే, నీటిపారుదల శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు, పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ఒక దరఖాస్తు, పోలీస్ శాఖ (ఎస్‌హెచ్‌ఓ)కు సంబంధించి ఒక దరఖాస్తు అందినట్లు అధికారులు వెల్లడించారు.ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని, అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీవో నరసింహులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత విమర్శలు చేయను

విజయవాడ నగర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యాలని కూటమి మేయర్ అభ్యర్థి

వంగవీటి రాధా స్పష్టం చేశారు. నగరంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఇబ్బంది పడకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. రాజకీయ ప్రత్యర్థి అయిన ఏబీ వెంకటేశ్వరరావు అనుభవాన్ని గౌరవిస్తానని, నగరాభివృద్ధికి ఆయన ఇచ్చే మంచి సూచనలు తప్పక స్వీకరిస్తానని తెలిపారు. నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయబోనని, విశ్వసనీయతకే కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.మరోవైపు, ఏబీ వెంకటేశ్వరరావు కూడా రాధాతో తనకు 20 ఏళ్ల పరిచయం ఉందని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయబోనని ప్రకటించారు. తమ మధ్య పోటీ రాజకీయపరమైనదే కానీ, వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఆత్మీయ పలకరింపు.. ఎన్నికల వాతావరణంలో హుందాతనాన్ని నింపింది. నవంబర్ 1న మేయర్ ఎన్నికకు పోలింగ్ జరగనుండగా, ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.బెజవాడ మేయర్ పీఠం కోసం ఎన్డీయే కూటమి నుంచి వంగవీటి రాధా, వామపక్షాలు-కాంగ్రెస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, వైసీపీ నుంచి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మధ్య త్రిముఖ పోరు నెలకొన్న విషయం తెలిసిందే.

మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదానం..

పోలీసు అమరవీరుల సంస్మరణార్థం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులు, సిబ్బంది

మోటకొండూరు, అక్టోబర్ 26(ప్రజా వాయిస్):-

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భువనగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ మరియు పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఆర్. ప్రదీప్ కుమార్, వై. సంతోష్ రెడ్డి, మహమ్మద్ జలీల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరితో పాటు మోటకొండూరు ప్రాంతానికి చెందిన యువకులు కడపర్తి మణిదీప్, ఎత్తరి సాయి దిలీప్, జంపాల నితిన్, జక్క కరుణాకర్ రెడ్డి, పన్నాల నవీన్ రెడ్డి, దేవరకొండ రవి మరియు అలిమినేటి సిద్ధారెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రాణాలను కాపాడే రక్తదాన కార్యక్రమంలో పోలీసులు, యువకులు భాగస్వాములు కావడం పట్ల పలువురు వారిని అభినందించారు.

వాల్మీకి ని యువత ఆదర్శంగా తీసుకోవాలి

బోయకులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

వాల్మీకి సంఘం అధ్యక్షుడు గుజ్జుల మునయ్య

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మహాకవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుజ్జుల మునయ్య మాట్లాడుతూ సమాజానికి వాల్మీకి మహర్షి అందించిన రామాయణ కావ్యం, ఆయన బోధనలు మానవాళికి ఎప్పటికీ మార్గదర్శకమని కొనియాడారు.యువత వాల్మీకి ఆదర్శాలను జీవితంలో అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే తెలంగాణ వాల్మీకి బోయాలను, ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూపని రాములు, కార్యదర్శి బోయిని సుధాకర్, మాజీ ఉపాధ్యక్షులు కిష్ట దశరథ,బోయిని అంజయ్య, భూపని కృష్ణ, భూపని శంకరయ్య, గుజ్జుల ధనుంజయ, బోయిని గాలయ్య, గుజ్జుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

కప్పర్లలో సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

గ్రామ అభివృద్ధిలో సీసీ కెమెరాల ఏర్పాటు శుభ పరిణామమని ప్రశంస

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు

నేరాల నియంత్రణకు ప్రతి వీధిలో నిఘా నేటి తక్షణ అవసరమని స్పష్టీకరణ

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

తాంసి మండల పరిధిలోని కప్పర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) సోమవారం అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి. సర్పంచ్ గండ్రత్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో, గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక నిఘా వ్యవస్థను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నివారణకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామం తమ భద్రత కోసం ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నిఘా పెంచడం ద్వారా అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, తాంసి మండల ఎస్సై జీవన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల గ్రామ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.